అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 17 ఏప్రిల్ 2026 పేజీలు : 04



# పార్లమెంట్‌లో మహిళా బిల్లుపై ఎమ్మెల్యే పరిటాల సునీత హర్షం

**- ఢిల్లీలో ఆంధ్ర మహిళా ఎమ్మెల్యే, ఎంపీలు సందడే సందడి - ముఖ్య నేతలతో భేటీలు**




కేంద్ర మంత్రి సీతారామన్‌ను కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా ఎమ్మెల్యేలు, పార్లమెంట్ సభ్యులు, ఎంపి లావు కృష్ణదేవరాయలతో మహిళా ఎమ్మెల్యేలు

**అనంతపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త బ్యూరో**

పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ చెందిన మహిళా ఎమ్మెల్యేలు, ఎంపీలు గురువారం సంతోషంతో ఢిల్లీలో సందడి చేశారు. ఎంపీల ఇళ్లల్లో విందు చేయడంతో పాటు ముఖ్య నేతలను కలుసుకున్నారు. అందులో భాగంగా రాయలసీమ జిల్లాలకు చెందిన మహిళా ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో మహిళా నారీ శక్తి వందన్ అధినియం బిల్లు ప్రవేశపెట్టడం.. దేశంలో యావత్ మహిళాలోకం గర్వించే రోజుగా నిలిచిపోతుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అభివర్ణించారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్ లో బిల్లు ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో ఆమె సహచర మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి ఢిల్లీకి వెళ్లారు. ఇందులో భాగంగానే గురువారం ఉదయం ఢిల్లీలోని ఎంపీ లావు కృష్ణదేవరాయలు నివాసంలో అల్పాహారం విందుకు హాజరయ్యారు. ఆ తర్వాత పార్లమెంట్ ఆవరణంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తో భేటీ అయ్యారు. మంత్రి సీతారామన్ అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. మహిళా బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యంలో తమ ఆనందాన్ని పం చుకున్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా ఎమ్మెల్యే పరిటాల సునీత సహచర ప్రజాప్రతినిధులతో కలిశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే సునీతను ఆప్యాయంగా పలకరిస్తూ కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత సాయంత్రం మంత్రి పెమ్మసాని నివాసంలో జరిగిన అల్పాహార విందులో పాల్గొన్నారు. ఆ తర్వాత కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి వెళ్లారు. అక్కడ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా బిల్లు ప్రవేశపెట్టడం తమ కళ్లారా చేసే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ చారిత్రక ఘట్టానికి మేము కూడా సాక్షులు అవుతుండడం గర్వంగా ఉందన్నారు. ఈ అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు ఇప్పటికే అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని.. అయితే రాజకీయాల్లో ఇంకా వారికి సముచితమైన స్థానం దక్కడం లేదు. జనాభా ప్రకారం మహిళలకు కూడా చట్టసభల్లో ప్రాధాన్యం ఉండాలన్నారు. ఏపీలో మహిళలను ప్రోత్సహించే విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. అసెంబ్లీలో కూడా మిగిలిన పార్టీల కంటే ఎక్కువ స్థానాలు ముఖ్యమంత్రి చంద్రబాబు కేటాయిస్తున్నారన్నారు. ఇప్పుడు 33శాతం అన్నది చట్టంగా మారితే.. మహిళా లోకం సంతోషిస్తుందన్నారు. రాజకీయంగా వారికి మరిన్ని అవకాశాలు ఇచ్చినట్టు అవుతుందన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ లో ఈ బిల్లు పాస్ కావాలని ఆమె ఆకాంక్షించారు. మిగిలిన పార్టీలు దీనిని రాజకీయంగా చూడకుండా మద్దతివ్వాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో మంత్రులు సవిత, అనిత, ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, గౌరు చరిత తదితరులున్నారు.



ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, ఎంపిలు

# మహిళా రిజర్వేషన్లతో మారనున్న రాజకీయ సమీకరణలు

**- ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాలు మహిళలకే**

**- ఆ స్థానాలు ఏవి అన్నది నేతల్లో ఉత్కంఠత**

**- ఎటు చూసినా నియోజకవర్గాల పునర్విభజన పై చర్చ**




**అనంతపురం, ఏప్రిల్ 16, (ప్రభాతవార్త బ్యూరో)**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నియోజకవర్గాల పునర్ విభజనతో ఆరు శాసనసభ స్థానాలు మహిళలకు కేటాయించే అవకాశం కనిపిస్తోంది. ఆ స్థానాలు ఏవి అయ్యే అవకాశం ఉంది? తమకు అనుకూలమైన శాసనసభ స్థానాలు కేటాయించే అవకాశం ఉందా ? అని మహిళా ప్రజాప్రతులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పలువురు మహిళా నాయకులు చర్చించుకుంటున్నారు. తమకు అనుకూలమైన ప్రాంతాల్లోని మహిళా రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తే బాగుంటుందని మహిళా నేతలు ఆశతో ఉన్నారు. ఇదే సమయంలో రాజకీయాల్లో చక్రం తిప్పుతూ వచ్చిన పలువురు పురుష నేతలు, ప్రజా ప్రతినిధులు కూడా బయటికి గంభీరంగా ఉంటున్నప్పటికీ మహిళా రిజర్వేషన్లతో తమకు బలం ఉన్న స్థానాలను కొట్టుకుపోతారేమో అని ఆందోళన పడేవారు ఉన్నారు. ఎస్సీ రిజర్వేషన్లతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పుడున్న రెండు శాసనసభ స్థానాలు మూడు అయ్యే అవకాశం ఉంది. నియోజక వర్గాల పునర్విభజన చట్టము, మహిళా రిజర్వేషన్ల బిల్లు పై గురువారం పార్లమెంట్లో వాడి వేడిగా చర్చ జరిగింది. ఎన్డీఏ ప్రభుత్వానికి పార్లమెంట్లో సంపూర్ణ బలం ఉండడంతో నియోజకవర్గాల పునర్విభజన చట్టం అమలులోకి వచ్చే అవకాశం మెండుగా ఉందని, మహిళా రిజర్వేషన్లు కూడా అమలయ్యే అవకాశం కనిపిస్తోందని రాజకీయ పార్టీల కార్యకర్తలు, నాయకుల్లో అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పుడున్న 14 శాసనసభ స్థానాలు 20 లేదా 21 అయ్యా అవకాశం ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో పాటు కొత్తవారికి ఎక్కువ అవకాశాలు వచ్చే అవకాశం ఉంది. గత రెండు విడుదలగా టికెట్ల కోసం శతవిధార ప్రయత్నం చేసి టిక్కెట్ దక్కని వారికి ఈ పరిణామం ఆశలు రేకెత్తిస్తోంది. ప్రధానంగా తెలుగుదేశం, వైసీపీలో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఆశలు ఎక్కువగా ఉన్నాయి. ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్నందున ఆర్థికంగా ఉన్న వారికే ఎక్కువ సీట్లు ఇచ్చే అవకాశం రాను రాను పెరుగుతోంది. గత ఎన్నికల్లో పార్టీ కోసం రెండు మూడు దశాబ్దాలుగా కష్టపడిన నాయకులను పక్కనపెట్టి

మిగతా 4లో...

# నేతల్లో స్థానిక పోరు టెన్షన్..!

**- సిఎం ప్రకటనతో పట్టణ నేతలు తర్జనభర్జన**

**- ఎన్నికలు ఎప్పుడొస్తాయోనని ఆశావాహుల ఎదురుచూపు**

**- సెప్టెంబర్ 23వ తేదీతో పరిషత్ పదవి కాలం ముగింపు**

**- పోటీకి నేతల చుట్టూ అభ్యర్థుల ప్రదక్షిణలు**

**రొళ్ల, ఏప్రిల్ 16, (ప్రభాతవార్త)**



మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాలలో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైంది. ఇప్పటికే గ్రామాల్లో ఎన్నికలపై ప్రధాన చర్చ సాగుతోంది. ఈ నెల 2వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ఎన్నికలపై మరింత ప్రచారం సాగుతోంది. ఆశావహులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికే మంత్రులు, ఎంఎల్ఎలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో హోరెత్తిస్తున్నారు. తాజాగా మంత్రివర్గ సమావేశం సందర్భంగా త్వరలో మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలని సిఎం చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశం చేయడంతో పట్టణాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సెప్టెంబర్ 23వ తేదీతో పరిషత్ల పదవీ కాలం ముగుస్తుంది. ఈ ఎన్నికలను ప్రభుత్వం సకాలంలో నిర్వహిస్తుదా.. అనే అనుమానాలు జనాల్లో నెలకొన్నాయి. పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోతే గ్రామాలాభివృద్ధి పూర్తిగా కుంటుపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. వీరి పాలనలో గ్రామాల పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని అందరిలో చర్చ మొదలైంది. సెప్టెంబర్ 23వ తేదీతో ఎంపీటీసీ జడ్పిటిసి పదవీ కాలం ముగుస్తుంది. ఈ ఎన్నికలను ప్రభుత్వం సకాలంలో నిర్వహిస్తుందా..? అనే అనుమానాలు జనాల్లో నెలకొన్నాయి. కూటమి నేతలు ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఆతృతతో ఎదురుచూస్తున్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన టిడిపి, బిజెపి, జనసేన నేతలు పదవుల కోసం తాపత్రయ పడుతున్నారు. ఇప్పటి నుంచే స్థానిక పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామస్థాయిలో టిడిపి కూటమి నేతల మధ్య కొంత అనైక్యత ఉన్న నేపథ్యంలో పదవుల కోసం ఎవరికి వారు విశ్వ ప్రయత్నాలు సాగిస్తున్నారు. నేతలు సైతం ఆర్థిక, అంగబలం ఉన్నవారి జాబితాను సిద్ధం చేసుకుంటున్నారు. ఒకవేళ తాము అనుకున్న రిజర్వేషన్ రాకపోతే అందుకు తగిన విధంగా అభ్యర్థి మార్పుపైనా ముందుగానే లెక్కలు వేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తవుతోంది. ప్రతిపక్ష వైసిపి సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ప్రణాళికలు రచిస్తోంది. దీంతో ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలు హోరాహోరీగా జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యాకే పంచాయతీ, పరిషత్ ఎన్నికలు కొద్ది రోజుల తేడాలో నిర్వహించే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ఏదేమైనా అటు గ్రామాల్లో, ఇటు పట్టణాల్లోనూ ఒకింత రాజకీయ వేడి మొదలైందనే చెప్పొచ్చు.

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మద్దతు ఇవ్వడంపై దృష్టి పెట్టాలి





కూడేరు మండలం ముద్దులాపురంలో రైతు నేస్తం ఉత్పత్తి కేంద్రామును జిల్లా కలెక్టర్ ఆనంద్ పరిశీలిస్తున్న దృశ్యాలు

**అనంతపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త బ్యూరో**

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మద్దతు ఇవ్వడంపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. జిల్లాలో పనిచేస్తున్న 200కు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాల విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడంపై జిల్లా యంత్రాంగం మే 1 నుంచి దృష్టి సారిస్తుంది. గురువారం కూడేరు మండలంలోని ముద్దలపురంలోని రైతు నేస్తం ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ యొక్క అత్యాధునిక చిరుధాన్యాలు, వేరుశనగ విలువ జోడింపు కర్మాగారాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ.. జిల్లాలో అరటి ఒక ప్రధాన ఉద్యాన పంట అని, దీనికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. కూడేరు తహశీల్దార్ ఉదయ భాస్కర్‌తో కలిసి తయారీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ చిరుధాన్యాల బిస్కెట్లు, వేరుశనగ చిక్కీల తయారీ ప్రక్రియను నిశితంగా పరిశీలించి, ఆర్ఎన్ఎఫ్‌పిసిఎల్ డైరెక్టర్ డా.వైవిని విచారించారు. మల్లా రెడ్డి, ఆ యూనిట్ ఎదుర్కొంటున్న మార్కెటింగ్ కార్యక్రమాలు మరియు ఇతర ఇబ్బందుల గురించి వివరించారు. సహజ వ్యవసాయాన్ని మరింత ఉధృతంగా ప్రోత్సహించాలని, అలాగే సామూహిక మార్కెటింగ్ మరియు విలువ జోడింపు చేపట్టేందుకు వీలైనన్ని ఎక్కువ రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏకతాటిపైకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ యాక్సియన్ ఫ్రాటర్నా ఎకాలజీ సెంటర్‌కు సలహా ఇచ్చారు. "ప్రస్తుతం, అన్ని నీశివీలు విలువ జోడింపులో చాలా తక్కువ వ్యాపారం చేస్తున్నాయి, దీనిని మెరుగుపరచాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. రూ.6 కోట్ల ఫ్యాక్టరీలో జరుగుతున్న తయారీ నాణ్యతను ప్రశంసిస్తూ రైతు ఉత్పత్తిదారుల కంపెనీని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అనేక ఉత్పత్తులను తయారు చేస్తూ, దేనిపైనా దృష్టి పెట్టకుండా బలమైన "బ్రాండ్ ఇమేజ్"ను అభివృద్ధి చేసుకోవడానికి బదులుగా, కేవలం రెండు " హీరో " ఉత్పత్తులపై దృష్టి కేంద్రీకరించి, స్థానిక ప్రత్యక్షవినియోగదారుల అమ్మకాలు మరియు ఎగుమతుల వరకు సాధ్యమయ్యే అన్ని మార్కెటింగ్ మార్గాలను ప్రయత్నించాలని కోరారు. ధృవీకరించబడిన సేంద్రీయ (భాగస్వామ్య హామీ పథకం) కూరగాయలు మరియు వేరుశనగ కోసం తినీనిది ఇప్పటికే 175 మంది రైతులతో కలిసి పనిచేస్తోందని రెడ్డి తెలిపారు. "అనంతపురం జిల్లాలోని 8 మండలాల్లో 20,000 మంది మహిళా రైతుల ద్వారా సాంప్రదాయ రైతులను సహజ వ్యవసాయ పద్ధతులు పాటించేవారిగా మార్చడాన్ని మేము ప్రోత్సహిస్తున్నాము", అని ఆయన తెలిపారు. వర్షాధార వ్యవసాయంలో ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని, తినీనిది ద్వారా రక్షిత నీటిపారుదల పద్ధతిలో దానిని ఎలా తగ్గించవచ్చో ఆనంద్ విన్నారు. ఇతర సిబ్బంది మురళి, రమేష్, సతీష్ మరియు కె.ఎన్.రాధ కలెక్టర్‌తో సంభాషించారు.

# కరెంటోళ్ల కాసుల బాట..!

**- పదిహేను వేలిచ్చుకో.. నియంత్రిక పుచ్చుకో..!**

**- పలుకుబడి..పైసలుంటేనే పని జరిగేది..!**

**- ముఖ్యమంత్రి సాక్షిగా ఆ శాఖపై పెల్లుబికిన అసంతృప్తి**



తాడిపత్రిలోని విద్యుత్తు అధికారుల కార్యాలయ సముదాయం

**తాడిపత్రి, ఏప్రెల్ 16, ప్రభాతవార్త**

మెరుగైన సరఫరా, శాఖాపరంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా విద్యుత్తు శాఖ 'కరెంటోళ్ల జనం బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే కొందరు విద్యుత్తు అధికారులు 'కరెంటోళ్ల కాసుల బాట' అనే నానుడిని సాకారం చేస్తున్నారు. 'కరెంటు విషయంలో ప్రజల సంతృప్తి రాష్ట్ర స్థాయిలో 70.6% ఉంటే జిల్లాలోనూ, తాడిపత్రి పరిధిలోనూ 67% మాత్రమే ఉందని, వినియోగదారుల సేవలో రాజీలేదని, మీకేమైనా సమస్యలుంటే చెప్పాలని, ఎక్కడైనా ఒక్క రూపాయి 'అవినీతి' ఉండకూడదని' ఇటీవల యాడికి పర్యటనకు వచ్చిన సందర్భంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే చెప్పారు. అయితే ఈ శాఖలో అవినీతి, వేదింపుల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనని ఆ రోజు ముఖ్యమంత్రి ఎదుటే ప్రజలు ఈలలు, కేకలతో చెప్పకనే చెప్పారు. ఈ కార్యాలయం అవినీతికి దూరమనే ప్రచారం చేయడం, ఎవరైనా లంచం అడిగితే మాకు ఫిర్యాదు చేయండి అనే పోస్టర్లు విద్యుత్తు కార్యాలయాల్లో ఏర్పాటు చేయడం వంటివన్నీ మాటలకే పరిమితం. విద్యుత్తు శాఖలో అంతులేని అవినీతి, అవకతవకలు చోటు చేసుకుంటున్నా కొరవడిన జనచైతన్యం, తమ పని జరిగితే చాలనే జన స్వార్థం వల్ల ఆ శాఖ అధికారులు ఆడిందే ఆట..పాడిందే పాటగా చలామణి అవుతోంది. అన్నదాతలకు నియంత్రికలు కావాలంటే రూ. 15 వేలు ఇస్తేనే పని జరుగుతోందని, ఈ పైసలిచ్చినా పలుకుబడి అదనంగా అడుగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వినియోగ దారులను వేదించి వసూళ్ల చేయడంలో కొందరు గుత్తేదారుల సహకారం కూడా అవినీతి అధికారులకు పుష్కలంగా ఉందనే విమర్శలున్నాయి.

### అవసరాన్ని బట్టి అదనపు పైకం

విద్యుత్తు వినియోగదారుల నుంచి అదనపు డబ్బు డిమాండు చేస్తూ వేదిస్తున్న విద్యుత్తు ఉద్యోగులపై ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందని పలువురు బాధితులు కోరుతున్నారు. ప్రత్యేక లంచం నిరోధక విభాగం(యాంటీ బ్రైవరీ సెల్)ను ఏర్పాటు చేసి లోతుగా విచారణ చేపడితే బాధితుల నుంచి ఆధారాలు లభ్యమయ్యే అవకాశాలు లేకపోలేదని పలువురు బాధితులు చెబుతున్నారు. నియంత్రికల మంజూరు, కొత్త సర్వీసుల జారీ వంటి పనులకు ముడుపులు ఇవ్వందే ముందుకు జరగడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. అదనపు డబ్బు కోసం అన్నదాతలను, దరఖాస్తుదారులను తరచూ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం, తిరిగి తిరిగి వేసారి తిప్పుకోవడంలోని ఆంతర్యం గ్రహించి తామే ఎంతో కొంత ముట్ట చెప్పే పరిస్థితికి వారిని తీసుకురావడం కొందరు విద్యుత్తు అధికారులకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. పలుకుబడికి విలువ ఇచ్చి పనిచేసినట్లు పైకి నటిస్తూ లోపల పైసలు నొక్కితేనే గాని పని పూర్తి చేయడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అన్నదాతలకైతే నియంత్రికకు ఒక రేటు, లేఔట్ వెంచర్లకైతే అంచనాలకు ఇంకో రేటు, ఫ్యాక్టరీలకైతే మరో రేటు చొప్పున కొందరు అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారంటే విద్యుత్తు శాఖలో అవినీతి, వేదింపులు ఏ స్థాయికి చేరాయో ఉన్నతాధికారులు గుర్తించాలి.

### అవినీతికి..అపఖ్యాతికి నిదర్శనాలు..!

ః తాడిపత్రి పట్టణంలో ఇటీవల ప్రారంభించిన ఓ పెద్ద ఎలక్ట్రానిక్ షాపుకు విద్యుత్తు సౌకర్యం కల్పించి సొమ్ము చేసుకోవడానికి ఓ అధికారి తన కింది స్థాయి అధికారిని తప్పించి తన చేతివాటం చూపించుకున్నాడనే విమర్శలు గుప్పుమంటున్నాయి.



తాడిపత్రిలోని ప్రధాన సబ్‌స్టేషన్

ఃఉన్నత స్థాయిలో శాఖాపరమైన అనుమతి పొంది చేపట్టాల్సిన ఒక పనిని ఒక అధికారి తన చాకచక్యంతో స్థానికంగానే చేపట్టి తన జేబు నింపుకోవడం, ఈ విషయం ఉన్నతాధికారులకు చేరకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఃకడప రోడ్డులో డీటీసీపీ అనుమతి లేని ఓ వెంచర్‌కు విద్యుత్తు సౌకర్యం కల్పించడంలో భాగంగా విద్యుత్తు సర్వీసు లైను, నియంత్రికల ఏర్పాటు చేసిన ఓ అధికారి వారితో రెండు ప్లాట్లు డిమాండు చేసినట్లు అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. తాము కుదుర్చుకున్న ఒప్పందం కంటే మరో రూ. లక్ష అదనంగా ఇస్తాం కానీ ప్లాట్లు ఇచ్చే పరిస్థితి లేదని యజమానులు తెగేసి చెప్పడంతో వారిచ్చిన సొమ్ముతో ఆ అధికారి సరిపెట్టుకున్నట్లు చర్చ సాగుతోంది.

ఃచుక్కలూరు రోడ్డులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌కు విద్యుత్తు సర్వీసు మంజూరులో కూడా తాను సొమ్ము చేసుకోవడానికి కింది స్థాయి అధికారిని దూరంగా ఉంచి పని కానిచ్చినట్లు ఆరోపణలున్నాయి.

ః తాడిపత్రిలోని కర్నూలు వెంచర్‌కు ఎదురుగా ఒక వ్యక్తి తనకు విద్యుత్తు లైను అడ్డంకిగా మారిందని, దాన్ని తొలగించడానికి అవసరమైన అంచనా(ఎస్టిమేట్)కు డబ్బులు చెల్లించాడు. ఆ తర్వాత చాలా కాలం వరకు అతను పట్టించుకోలేదు. అదే ప్రాంతంలో ఉన్న మరో వ్యక్తి కూడా సదరు లైను తనకు అడ్డంకిగా ఉందని, తొలగించమని కోరగా రెండో వ్యక్తితో డబ్బు కట్టించుకొని మొదటి వ్యక్తి అంచనాను అధికారులకు చూపించి పనికానిచ్చేశాడు. ఒకే పనికి రెండు అంచనాలు వేసి ఒకటి తనకు, మరొకటి డిపార్టుమెంట్‌కు వాడుకోవడం ఆయన తెలివితేటలకు నిదర్శనం.

ః ఈ విషయంపై ఓ కిందిస్థాయి అధికారి ఆ అవినీతి అధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా ఓ ఉన్నతాధికారిని విచారణకు నియమించారు. ఆ ఉన్నతాధికారి విచారణ ఏమైందో ఇప్పటి వరకు ఏమీ తేల్చకపోవడం గమనార్హం.

ఃచుక్కలూరులోని కోల్డ్ స్టోరేజి సమీపంలోని

మిగతా 4లో...

# కేజీబీవీల్లో మెరిసిన ఆణిముత్యాలు

**- మొదటి సంవత్సరంలో 5 కేజీబీవీల్లో, రెండవ సంవత్సరంలో 8 కేజీబీవీల్లో 100 శాతం ఉత్తీర్ణత**

**- పెద్దవడుగూరు కేజీబీవీలో కేవలం 35.71 శాతం మాత్రమే ఉత్తీర్ణత**



ఒకేషనల్ ఇంటర్ లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన డి. హీరేహాల్ కెజిబివి విద్యార్థిని ఎం.భారతిని అభినందిస్తున్న విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు.

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త**

తాజాగా విడుదల అయిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినీలు ఉత్తమ ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో నార్పల, కనేకల్, ఆత్మకూరు, డి.హీరేహాల్, గార్లదిన్నె కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కూడేరు కేజీబీవీలో 97.06 శాతం, కుందుర్పి కేజీబీవీలో 95 శాతం, గుత్తి కేజీబీవీలో 95 శాతం, ఎల్లనూరు కేజీబీవీలో 91.30 శాతం, ఉరవకొండ కేజీబీవీలో 91 శాతం, సింగనమల కేజీబీవీలో 87.50 శాతం, పెద్దపప్పూరు కేజీబీవీలో 87.50 శాతం, కళ్యాణదుర్గం కేజీబీవీలో 86.21 శాతం, సెట్టూరు కేజీబీవీ లో 80 శాతం, బెలుగుప్ప కేజీబీవీలో 78.95 శాతం, యాడికి కేజీబీవీ లో 78 శాతం, కంబదూరు కేజీబీవీ లో 77 శాతం, కేజీబీవీగుంతకల్లు కేజీబీవీలో 76.47 శాతం, గుమ్మగట్ట కేజీబీవీలో 76.32 శాతం, విడపనకల్లు కేజీబీవీలో 75.68 శాతం, పామిడి కేజీబీవీలో 75.61 శాతం, బొమ్మనహాలు కేజీబీవీలో 75 శాతం, తాడిపత్రి కేజీబీవీలో 71.79 శాతం, రాప్తాడు కేజీబీవీలో 71.43 శాతం, పుట్లూరు కేజీబీవీలో 69.70 శాతం, అనంతపురం కేజీబీవీలో 69.70శాతం, బ్రహ్మసముద్రం కేజీబీవీలో 60.23 శాతం, వజ్రకకూరు కేజీబీవీలో 68.42 శాతం, రాయదుర్గం కేజీబీవీలో 65.79 శాతం, పెద్దవడుగూరు కేజీబీవీ లో 29 మందికి గాను కేవలం 19 మంది మాత్రం పాస్ కావడంతో 65.52 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

### రెండవ సంవత్సరం ఫలితాలు

కూడేరు, బొమ్మనహల్, సింగనమల, కనేకల్, ఆత్మకూరు, డి.హీరేహాల్, గుత్తి, గార్లదిన్నె కేజీబీవీల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. తాడిపత్రి మైనారిటీలో 96 శాతం, సెట్టూరు లో 94.12 శాతం, యాడికి లో 94 శాతం, విడపనకల్ లో 93.10 శాతం, బుక్కరాయసముద్రంలో 92 శాతం, పెద్దపప్పూరు లో 91.18 శాతం, ఉరవకొండలో 89 శాతం, బెలుగుపలో 88.57 శాతం, నార్పలలో 86.21 శాతం, కళ్యాణదుర్గంలో 85.71 శాతం, ఎల్లనూరులో 85 శాతం, పుట్లూరులో 84 శాతం, రాప్తాడులో 83.78 శాతం, రాయదుర్గంలో 82.35 శాతం, అనంతపురంలో 77.42 శాతం, బ్రాహ్మసముద్రంలో 72.73 శాతం, పామిడిలో 70.37 శాతం, కుందుర్పిలో 67.65 శాతం, గుంతకల్లులో 66.67 శాతం, గుమ్మగట్టలో 52.78 శాతం, తాడిపత్రిలో 52.63 శాతం. వజ్రకరూర్ లో 50 శాతం, పెద్దవడుగూరులో 28 మంది విద్యార్థులకు గాను కేవలం పది మంది విద్యార్థులు పాస్ కావడంతో 35.71 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. అన్ని కేజీబీవీ లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి విజయ పదం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేసినప్పటికీ మొదటి సంవత్సరంలో 5 కేజీబీవీలు, రెండవ సంవత్సరంలో 8 కేజీబీవీలు మినహా మిగిలిన అన్ని కేజీబీవీలో 100 శాతం ఉత్తీర్ణత రాకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అయినా అన్ని కేజీబీవీల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉన్నతాధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## రూ.60 లక్షల వ్యయంతో ఎడిసిసి బ్యాంక్ నిర్మాణానికి ప్రారంభమైన చర్యలు

### బ్యాంక్ మేనేజర్ ఫణి భూషణ్ ఆధ్వర్యంలో మార్కింగ్

కళ్యాణదుర్గం ఏప్రిల్ 16 ప్రభాతవార్త



ఏడీసీసీ బ్యాంక్ నిర్మాణానికి మార్కింగ్ ఇస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం పట్టణములోని జూనియర్ కాలేజ్ రోడ్డులో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ కళ్యాణదుర్గం శాఖ నూతన భవన నిర్మాణానికి గురువారం చర్యలు చేపట్టారు. బ్యాంక్ మేనేజర్ ఫణి భూషణ్ ఆధ్వర్యంలో ఇంజనీర్ ప్రసాద్ బృందం బ్యాంకు నిర్మాణానికి అవసరమైన మార్కింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ పని భూషణ్ మాట్లాడుతూ బ్యాంకు నూతన భవన నిర్మాణానికి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు స్థలం కేటాయించి భూమి పూజ చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో 60 లక్షల వ్యయంతో భవన నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు తెలిపారు. టెండర్లు ఖరారు కావడంతో నూతన బ్యాంకు కార్యాలయా నిర్మాణాలకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. బ్యాంకు ఖాతాదారులకు అన్ని సౌకర్యాలతో కూడిన నూతన బ్యాంకు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం అధ్య భవనములో ఉన్న బ్యాంకు పై అంతస్తులో ఉన్నందున ఖాతాదారులు సరైన మెట్ట సౌకర్యం కూడా లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే అందరికీ సౌకర్యవంతంగా అంబేద్కర్ సర్కిల్ వద్ద జూనియర్ కళాశాల రోడ్డులో నూతన బ్యాంకు భవన నిర్మాణాలను కాలంలోని పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

## గర్భవతులు బాలింతలు సమతుల ఆహారం తీసుకోవాలి : సూపర్వైజర్ ఈశ్వరమ్మ

కనేకల్ ఏప్రిల్ 16 ప్రభాతవార్త



గర్భవతులకు సూచనలు ఇస్తున్న సూపర్వైజర్ ఈశ్వరమ్మ

గర్భవతులు బాలింతలు సమతుల సమతుల ఆహారాన్ని తప్పక తీసుకోవాలని గర్భవతులకు సూపర్వైజర్ ఈశ్వరమ్మ సూచించారు. పోషణ పక్వాడా కార్యక్రమం కనేకల్ మండలం ఉడేగోళం గ్రామంలో ఎనిమిదవ పోషణ పక్వాద కార్యక్రమం సూపర్వైజర్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగింది గర్భవతులు బాలింతలకు సమతుల ఆహారం గురించి మనం తినే ఆహారంలో ఆకుకూరలు కూరగాయలు పండ్లు పప్పు దినుసులు అన్ని సమపాళ్లలో ఉండాలని గర్భవతులు తినే ఆహారం పట్ల పురుషుల భాగస్వామ్యం కూడా ఉండాలని ఈశ్వరమ్మ తెలియజేశారు పిల్లల ఆరోగ్య పరీక్షలు వ్యాధి నిరోధక టీకాలు పెరుగుదల పర్యవేక్షణలో పాల్గొనడం తండ్రుల బాధ్యతను తెలియ చేశారు.

## జనగణనకు శిక్షణ తరగతులు

గుమ్మఘట్ట ఏప్రిల్ 16 ప్రభాతవార్త



తహశీల్దార్ రజాక్ వలి

మండలంలోని జరిగేటువంటి జనగణనకు సంబంధించి నియమించిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ తరగతులను మొదటి బ్యాచ్ 18 042026 నుంచి 21042026 వరకు రెండవ బ్యాచ్ 2304 2026 నుండి 25042026 వరకు మండల కేంద్రము లోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నందు నిర్వహించబడునని జనగణనకు నియమించిన అధికారులకు శిక్షణ తరగతులు కు తప్పకుండా హాజరు కావాలని ఎన్యూమరేషన్ కొరకు ఈ నెల 16 నుంచి 30 వరకు నమోదు చేసుకోవచ్చని ప్రజలు తప్పకుండా వినియోగించుకొనవలెనని తహశీల్దార్ రజాక్ వలి తెలిపారు

## మండల వైద్యాధికారిగా యన్.హిమబిందు

బెళుగుప్ప, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



పదవి బాధ్యతలు చేపట్టిన మెడికల్ అధికారి

బెలుగుప్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గురువారం Dr.N. హిమబిందు బాధ్యత లు చేపట్టిన రూ ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తున్నా ప్రొద్దుటూరు లో అర్బన్ హెల్త్ పనిచేసన. వచ్చిన వారందరికి సేవలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది పాల్గొనారు.

## ఆరుమంది జూదారులు అరెస్ట్

### – 10,030నగదు స్వాధీనం

శెట్టూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



అరెస్ట్ అయిన ఆరుమంది జూదారులు

మండల పరిధి లోని యాటకల్లుగ్రామం పరిసర ప్రాంతాల పొలాల్లో ఉన్న కంపచెట్ల మధ్య అక్రమంగా జూదం ఆడుతున్న ఆరుగురిని పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం, సెట్టూరు మండలంలోని ఒక గుట్టుచప్పుడు కాకుండా జూదం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ సుమన్ తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులు యాటకల్లుగ్రామానికి చెందిన పడమటి పెద్దన్న,చాకలి వెంకట రమణ, బోయ ఆస్వర్థనారాయణ, గొల్ల పాండురంగ, మేద నగేష్, కోడిపల్లి మల్లికార్జున,లు నగదు పందేలు కాస్తూ ఉండగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 10,030రూపాయల నగదును,స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ, అక్రమ కార్యకలాపాలపై పోలీసులు కఠినంగా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో జూదం వంటి వ్యసనాలు కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీస్తాయని, ప్రజలు ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అరెస్ట్ అయిన వారిపై కేసు నమోదు చేసి, విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఇలాంటి దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## నూతన విధానాలతో పట్టణాల అభివృద్ధి

### గోవా జాతీయ సదస్సులో కమిషనర్ మల్లికార్జున

హిందూపురం ఏప్రిల్ 16 ప్రభాతవార్త



సదస్సుకు హాజరైన కమిషనర్ మల్లికార్జున

నూతన సాంకేతిక పద్ధతులు, ఆధునిక విధానాలతో మొదలగు వాటిని అనుసరిస్తూ పట్టణాలు, నగరాల్లో చేయాల్సిన అభివృద్ధిపై గోవాలోని పనాజీలో జాతీయస్థాయి సదస్సు నిర్వహించగా ఆంధ్రప్రదేశ్ నుంచి హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ హాజరయ్యారు. గురువారం దేశవ్యాప్తంగా వివిధ నగరాల అభివృద్ధి, పట్టణ పాలనలో ఆధునిక పద్ధతులు, స్వచ్ఛత, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజా సేవల సమర్థవంతమైన అమలు వంటి అంశాలపై నిర్వహించిన సమావేశంలో కమిషనర్లు చర్చించారు. సదస్సులో పట్టణ అభివృద్ధి సంబంధిత ఉత్తమ పద్ధతులు, సాంకేతిక వినియోగం, స్మార్ట్ సిటీ విధానాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో పాల్గొనడం ద్వారా హిందూపురం మున్సిపాలిటీసేవలను మరింత మెరుగుపర్చడానికి కొత్తఆలోచనలు, ప్రణాళికలను అమలు చేయడానికి దోహదపడుతుందని మల్లికార్జున తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

హిందూపురం టౌన్ ఏప్రిల్ 16 ప్రభాతవార్త



గాయపడిన విద్యార్థులు

హిందూపురం మున్సిపాలిటీ కొట్నూరు రైల్వే గేట్ సమీపంలో బిట్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోరంట్లకు చెందిన అనిల్, మడకశిరపు చెందిన భరత్, లకు తీవ్ర గాయాలయ్యాయి. విద్యార్థులు ఇద్దరు ద్విచక్ర వాహనంపై హిందూపురం వైపు వస్తుండగా జెసిబి అడ్డురావడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలం వద్ద బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజ రెడ్డి మానవతా దృక్పథంతో గాయపడిన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఏపీజేఏసీ చైర్మన్‌గా విద్యాసాగర్ బాధ్యతలు

### జిల్లా చైర్మన్‌గా మాధవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ జెఏసి చైర్మన్ విద్యాసాగర్

కళ్యాణ్ దుర్గం టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

ఏపీజేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా విద్యాసాగర్ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో గణనీయమైన పురోగతి సాధించామని జిల్లా చైర్మన్ జె. మాధవ్ తెలిపారు. సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గతంలో ఉద్యోగుల జిపిఎఫ్, ఏపీజీఎల్ఐ, సీపీఎస్ కాంట్రిబ్యూషన్‌లకు సంబంధించిన సుమారు రూ.33 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండగా, ఎలాంటి ఆందోళనలకు పిలుపునివ్వకుండానే వాటిలో దాదాపు రూ.20 వేల కోట్లు విడతల వారీగా సాధించిన ఘనత ఏపీజేఏసీకే దక్కుతుందని పేర్కొన్నారు.ఇటీవల పెన్షనర్లకు సంబంధించిన గ్రాట్యుటీ, సరెండర్‌లీవ్ ఎన్‌కాష్మెంట్‌కింద సుమారు రూ.3కోట్లువిడుదల చేయించడంలో కూడా జేపీసీ కీలక పాత్ర పోషించిందన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్‌లీవ్ విషయంలోకూడా మార్పులుతీసుకువచ్చి, గతంలో 18 సంవత్సరాల వరకు మాత్రమే ఉన్న ఈసదుపాయాన్ని సేవలో ఉన్నంతకాలం వినియోగించుకునేలా ప్రభుత్వంద్వారా జీవో తీసుకురావడం జరిగిందని తెలిపారు.ఇంకా పెండింగ్‌లో ఉన్న 12వ పీఆర్‌సీ, ఐఆర్ వంటి అంశాల సాధనకు ఏపీజేఏసీ కృషి కొనసాగిస్తుందని మాధవ్ స్పష్టం చేశారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధనకు ఏపీజేఏసీ ఒక వేదికగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ మాధవ్ ఆధ్వర్యంలో మూడు తాలూకాల ఏపీజేఏసీ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కళ్యాణదుర్గం తాలూకా చైర్మన్‌గా తిరుపాలయ్య, కార్యదర్శిగా ఎం. గణేష్ (ఏపిటీఎఫ్ 257)తో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.కంబదూరు తాలూకా చైర్మన్‌గా వీజీ ఉమా మహేష్, కార్యదర్శిగా టి. రియాజ్ మహమ్మద్ ఏపిటీఎఫ్ 257, ట్రెజరీ ఉద్యోగుల సంఘం నాయకుడు కిషోర్ కుమార్, టి. మధుబాబుతో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.కనేకల్ తాలూకా చైర్మన్‌గా సోమశేఖర్, కార్యదర్శిగా బి. నాగరాజు (ఏపిటీఎఫ్ 1938)తో పాటు 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవికుమార్, ట్రెజరర్ ప్రవీణ్ కుమార్, నాయకులు వెంకటరమణ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పురుషులు గరిటె పట్టారు.. వంటల్లో మేము సైతం అన్నారు

### - కుటుంబపోషణలో...పురుషుల పాత్రపై అవగాహన కార్యక్రమాలు

### - సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ ప్రోగ్రాం

గోరంట్ల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సూపర్‌వైజర్

పులేరు గ్రామంలో పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం పురుషులకు వంటల పోటీల కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సోమందేపల్లి సిడిపిఓ డాక్టర్‌శాంతలక్ష్మి ఆదేశాలమేరకు గోరంట్లమండలం పులేరు గ్రామంలో పోషణపక్వాడ కార్యక్రమాన్ని ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబపోషణలో పురుషుల భాగస్వామ్యం అనే అంశం పైన పురుషులకు అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో తండ్రుల సమావేశం ఏర్పాటు చేసి గర్భవతులు, చిన్నపిల్లల సంరక్షణలో తండ్రుల బాధ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం సూపర్‌వైజర్ మాట్లాడుతూ కుటుంబానికి సమతుల ఆహారం అందించడంలో తండ్రుల బాధ్యత, సహకారం చాలా ఉందన్నారు. కుటుంబానికి పోషకవిలువలు కలిగిన ఆహారపదార్థాలు సమకూర్చి ఇంటిలోని మహిళలు, పిల్లలసంరక్షణ బాధ్యత తండ్రులు తీసుకోవాలన్నారు. బయట దొరికే ప్యాకెడ్ ఫుడ్, జంక్ ఫుడ్ ఇంటికి తీసుకురాకుండా అధిక పోషక విలువలు కలిగిన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు సమృద్ధిగా తీసుకుని వచ్చి అవికుటుంబంలోని మహిళలు, పిల్లలుతీసుకునేలా వారిని ప్రోత్సహించి కుటుంబంఅంతా ఆరోగ్యంగాఉండేలా పురుషులు బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే పిల్లలు మొబైల్స్, టీవీ చూడకుండా చూసే బాధ్యత కూడా తండ్రి తీసుకోవాలన్నారు. కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే అది పురుషులపై అధికభారం ఏర్పడుతుందని, అందువలనవారు కుటుంబమంతా పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటూ సరైనటువంటి ఆరోగ్య అలవాట్లను అలవాటు చేసుకోవాలని, దీనివలన కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పోషకారంపై అవగాహన కల్పించడానికి, వారిని భాగస్వామ్యం చేయడానికి పురుషులకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు చలపతి, శ్రీదేవి, గ్రామ పెద్దలు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రామప్ప, శ్రీనివాసులు, నాగభూషణ, అంగన్‌వాడి కార్యకర్తలు శాంతమ్మ, ప్రభావతి, లలిత, ఎంఎస్‌కే, ఏఎన్‌ఎం, ఫీల్డ్ అసిస్టెంట్ రఘు, ఆశ, సహాయకురాలు మంజుల, తల్లులు పాల్గొన్నారు.

## పీఎం సూర్య ఘర్" లక్ష్యాలను వేగంగా పూర్తి చేయండి

### జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన"బియ్యం సూర్యఘర్" పథకం లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలు నందు ఖిపీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనఖి అమలుపై జిల్లా కలెక్టర్ గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని హిందూపూర్, కదిరి, పుట్టపర్తి డివిజన్ల వారీగా అందుతున్న దరఖాస్తులు, గ్రౌండింగ్ పురోగతిని ఆయన పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 45,428దరఖాస్తులు నమోదు కాగా, అందులో 45,407దరఖాస్తులకు ఫిజిబిలిటీ ఆమోదం లభించిందన్నారు. హిందూపూర్ డివిజన్ 25,117 దరఖాస్తులతో ముందంజలో ఉండగా, పుట్టపర్తి 10,942, కదిరి 9,369 దరఖాస్తులను కలిగి ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా ఎస్సీ/ఎస్టీ విభాగంలో 40,486 దరఖాస్తులు నమోదు కాగా, వందలాది ఇళ్లలో ఇప్పటికే సోలార్ ప్యానెళ్ల అమరిక పూర్తయిందన్నారు. జిల్లాలోని 12 ప్రాంతాలలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్ల కోసం 272.4 ఎకరాల భూమిని గుర్తించామని, ఇందులో ఇప్పటికే 153.7 ఎకరాలకు అడ్వాన్స్ పొసెషన్ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు.సబ్సిడీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో త్వరగా జమ అయ్యేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న ఇన్స్పెక్షన్లను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఇ మోసెస్,డిఆర్‌డిఎ పిడి నరసయ్య, మెప్మా పిడి నాగరాజు పాల్గొన్నారు.

## గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ

### - రామానందన్ సేవా దృక్పథంపై ప్రశంసల జల్లు

లేపాక్షి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

లేపాక్షి మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గురువారం రామానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ అధినేత కరణం రామానందన్ ప్రతి వారం వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భవతులకు భోజన వసతి కల్పిస్తూ తన ఉదారతను చాటుకుంటున్నారు. ఈ వారం దాదాపు 65 మంది మహిళలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యులు మరియు సిబ్బంది మాట్లాడుతూ గర్భవతులకు పౌష్టికాహారం అందించడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని, రామానందన్ చేస్తున్న ఈ సేవలు ఎంతో అభినందనీయమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, రామానందన్ మిత్రులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి సమస్య రాకుండా చూడండి

### - ఎంపిపి వెంకటరత్నమ్మ

లేపాక్షి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వెంకటరత్నమ్మ

మండల పరిధిలోని ఏ ఒక్క గ్రామంలోనూ వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపిపి వెంకటరత్నమ్మ అధికారులకు సూచించారు. గురువారం లేపాక్షి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో బోర్ల మరమ్మతులు, పైప్‌లైన్ల లీకేజీలను తక్షణమే సరిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సబ్సిడీపై అందుతున్న వివిధ పరికరాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సోలార్ పరికరాల వినియోగంపై ప్రజలు మొగ్గు చూపాలని స్పష్టం చేశారు. మండల వ్యాప్తంగా ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఎంఈఓ నాగరాజునాయక్ సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆంజనరెడ్డి, జెడ్‌పిటిసి శ్రీనివాసరెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు, ఎంపిటిసి గంగాధర్, కోఆప్షన్ సభ్యుడు ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పీఎంబీఎస్‌వై, పీఎంజేజేబీవై బీమా చెక్కుల పంపిణీ

### -బీమా సదుపాయం కలిగి ఉండాలన్న మేనేజర్, ఎంపీడీవో, ఏపీవో

ఉరవకొండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



బాధిత కుటుంబాలకు చెక్కును అందిస్తున్న బ్యాంకు మేనేజర్, ఎంపీడీవో, ఉపాధిహామీ ఏపీవో

పట్టణంలోని యూనియన్ బ్యాంకులో అధికారులు గురువారం వివిధ ప్రమాదాల్లో మరణించిన బాధిత కుటుంబాలకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంబీఎస్‌వై), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) పథకాల కింద ముగ్గురికి 2 లక్షల రూపాయల చొప్పున బీమా సాయం చెక్కులను పంపిణీ చేశారు. బ్యాంకు మేనేజర్ పుంజు శ్రీరంగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీడీవో బి.వి.రవి ప్రసాద్, ఉపాధిహామీ ఏపీవో కె.సుజాత అతిథులుగా హాజరై మృతుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందించారు. ఎం.వన్నూరు స్వామి మరణించగా నామిని గీతమ్మకు, హెచ్.అజాన్ మరణించగా నామిని వరలక్ష్మికు, రామకృష్ణ మరణించగా నామిని సరోజాకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు, ఉపాధిహామీ కూలీలు ప్రతిఒక్కరూ బీమా సదుపాయాన్ని కలిగి ఉండాలని బీమా మొత్తం ఆపత్కాలంలో వారిని, వారి కుటుంబాలను ఆదుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీలు సతీష్, ధనుంజయ, సీఎఫ్‌ఎల్ కౌన్సిల్ సభ్యులు సుమనాయక్ పాల్గొన్నారు.

## కుళాయిలకు దుర్గంధ భరిత కలుషిత నీటి సరఫరా..!

### -నెల రోజులుగా ఇదే పరిస్థితి అంటున్న ఉరవకొండ 11వ వార్డు ప్రజలు

### -అన్నీ తెలిసినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన

ఉరవకొండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



కుళాయిలకు సరఫరా అయిన దుర్గంధ భరిత నురగ నీరు

ఉరవకొండ పట్టణంలోని 11వ వార్డులో కుళాయిలకు దుర్గంధ భరిత డ్రైనేజీ నీటితో కలుషితమైన నీరు సరఫరా అవుతుండటంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు నెల రోజుల నుండి కుళాయిలకు రంగు మారిన నురుగతో కూడిన దుర్గంధ భరిత కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో తాగునీటి కోసం తాము అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయాన్ని ఇదివరకే పలుమార్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర కాలనీలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు. గతంతో పోల్చితే ఇప్పుడు నీటి సరఫరా మెరుగుపడినా దుర్గంధ భరిత కలుషిత నీటి సరఫరా కారణంగా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోందని వాపోతున్నారు. తాగునీటి పైప్‌లైన్‌లోకి ఎక్కడో డ్రైనేజీ నీరు కలిసి కలుషితమవుతోందని అనీ న తెలిసినా అధికారుల్లో మాత్రం చలనం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

## గొంతు కోసుకున్న మహిళ

### - ప్రాణం దక్కించిన ప్రభుత్వ వైద్యులు

గుత్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



గొంతు కోసుకున్న మల్లీశ్వరి



మహిళకు వైద్యం చేస్తున్న డాక్టర్ల బృందం

క్షణికావేశంలో తన గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళకు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్య బృందం చికిత్స నిర్వహించి ప్రాణాలను కాపాడారు. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో చేసే ఆపరేషన్‌ను స్థానికంగానే చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. తుగ్గిలి మండలం జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన మల్లీశ్వరి అనే మహిళ సోమవారం ఉదయం కత్తితో తన గొంతు కోసుకుంది. తీవ్ర ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెను కుటుంబీకులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టరు ఎల్లప్ప ఆధ్వర్యంలో డాక్టర్లు రాజేష్, చైతన్య, ఐశ్వర్య, ప్రియాంక, హనుమంతుల వైద్య బృందం నాలుగు గంటల పాటు శ్రమించి ఆమెను ప్రాణాపాయస్థితి నుండి రక్షించగలిగారు. తదుపరి ఆమెను మానసిక చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. కౌన్సిలింగ్ అయిన పిమ్మట ఆమెకు స్థానిక ప్రభుత్వాసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. ఖరీదైన శస్త్ర చికిత్సను ఉచితంగా ఆసుపత్రిలోనే అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందించే వైద్యాన్ని స్థానికంగానే అందించడం పట్ల వైద్య బృందంను అభినందించారు.

## మా భూములకు రస్తా చూపించండి

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



ఆర్డీవోకు వినతి పత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

పుట్టపర్తి మున్సిపాలిటీలోని కొవెలగుటవల్లి గ్రామంలో ఉన్న రైతులు తమ పంట పొలాలకు రస్తా చూపించాలని ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. గురువారం ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులు మాట్లాడుతూ, తమ పూర్వీకుల కాలం నుంచి ఇప్పటివరకు గ్రామం నుంచి మా పంట పొలాలకు వెళ్లే రహదారి లో ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ వారి పంట పొలాలలో దారి విడుచుకోవడం జరిగిందన్నారు. అయితే ఇటీవల కాలంలో గ్రామంలో కొంతమంది రైతులు ఆర్థిక ఇబ్బందుల వల్ల వారి పంట పొలాలను విక్రయించడం జరిగిందన్నారు. అక్కడ భూమి కొన్న రైతులు రామప్ప, శ్రీనివాసులు, వెంకటరాముడు మీకు రస్తా లేదు అని మొత్తం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. మా గ్రామంలో పొలాలు కొనేందుకు వచ్చిన ఆ దళారులు కూడా గ్రామం నుంచి ఒకరికి ఒకరు విడుచుకున్న రస్తా లోని వెళ్లి భూములు కొన్నారని, అయితే ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ రహదారులు నిర్మిస్తున్న నేపథ్యంలో మా గ్రామ సమీపంలో నేషనల్ హైవే రహదారి నిర్మించారన్నారు. ఆ రహదారి ఉంది అని తమ గ్రామం నుంచి వెళ్లే రహదారి వారు ఆక్రమించుకొని మీకు ఏమి చేత అయితే అది చేసుకోండి, అడ్డుకునే అధికారం మీకు లేదు, మీ దగ్గర ఏమైనా ఉంటే తీసుకురండి అంటూ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి తమ రస్తా సమస్య పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ రైతులు వెంకటేష్, ఆంజనేయులు, శ్రీరాములు,నారప్ప, సత్యనారాయణ, ఆదినారాయణ, సాయిరాం, ఆదిమూర్తి, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరు మన నీరు జలధార పనులను పర్యవేక్షించిన టిడిపి నాయకులు

పెనుకొండ ఏప్రిల్ 16 ప్రభాతవార్త

పెనుకొండ నియోజకవర్గం పరిగి మండల పరిధిలోని కోడిగెనహళ్లి పంచాయితీ లో మన ఊరు మన నీరు జలధార కార్యక్రమంలో భాగంగా పూడికతీత పనులు జరుగుతున్నాయి. మంత్రి సవితమ్మ ఆదేశాలతో జలధార పూడికతీత పనులను పరిగి మండల టిడిపి నాయకులు గురువారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమయ్య , లైవ్ స్టాక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశులు,మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సోమప్ప, మండల టిడిపి నాయకులు మాజీ జెడ్పిటిసి బాలాజీ, జనరల్ సెక్రెటరీ నాగరాజు, మాజీ ఎంపిటిసి కిష్టప్ప, చెరువు సంఘం అధ్యక్షులు రఘు, డీలర్ సతీష్ , వెంకట్రాములు, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు పాల్గొన్నారు.



జలధార పనులను పర్యవేక్షిస్తున్న టిడిపి నాయకులు

# ఒక్కరి సాయం.. వేయి ఊళ్లకు దీపం

## - ప్రాజెక్టుల ఆశా కిరణం. మట్టిలో మాణిక్యం.

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 16, (ప్రభాతవార్త)

వ్యవసాయంలో "సాయం" ఉంది. అన్నదాతలో "దాత" దాగి ఉంది.సాయం చేయడంలో ఆయనకు ఆయనే సాటి. ఇక దానకర్ణుని మించిన మేటి. దాన్యపు గింజలు పండించి అందరి ఆకలిని తీర్చే అలుపెరుగని యోధుడు...నేడు ప్రపంచానికి వెలుగునిచ్చే కాంతి కిరణం అయ్యాడు. ప్రాజెక్టుల పాలిట ఆశా దీపమై మట్టిలో మాణిక్యం అనిపించు కున్నారూ.ఒక్క సాయంతో వెయ్యి ఊళ్ళకు వెలుగును పంచుతున్నారూ. రైతు లోకాన్ని మరోసారి చరిత్రలో నిలబెట్టిన ధన్య జీవి కి మనం ఏమి ఇచ్చినా రుణం తీరదు. అదే మట్టి మనిషి మహత్యం.ప్రాజెక్టులు అంటే అందరికీ భయం. భూములు కనుమరుగవుతాయని, రైతులకు కష్టాలు వస్తాయని అయితే ప్రస్తుతం మన సీమ ప్రాంతంలో అడుగు పెడుతున్న పవర్ ప్రాజెక్టుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

రైతులకు మేలు చేస్తున్నాయి. ఆసరాగా నిలిచి ఆదుకుం టున్నాయి. స్వచ్ఛమైన నాణ్యమైన విద్యుత్ పునరుత్పత్తిని చేస్తున్నాయి. భగభగ మండే సూర్యుడు ఎండను విద్యుత్తుగా మార్చుతున్నా యి. గాలి గతి శక్తిని బంధించి గాలి మరలతో విద్యుత్ ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తున్నాయి. రాబోయే తరానికి సరిపడే విద్యుత్ ఉత్పత్తి నిలువ ఉంచి ట్రాన్స్మిషన్ టవర్ల ద్వారా సరఫరా చేస్తున్నాయి.మన దేశం వికసిత్ భారత్ కావాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం సౌర,పవన విద్యుత్ ఉత్పత్తికి పెద్దపీట వేసింది. పలు పవర్ ప్రాజెక్టుల అమలుకు పచ్చ జెండా ఊపింది. ఇందుకు అనువైన ప్రాంతాలను గుర్తించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది.ఏడాదిలో తీవ్రమైన ఎండలు.. ఆ ఎండకు మొక్క మొలవని పొలాలు.. కరువుకు శాశ్వత నిలయాలు అయినటువంటి రాయలసీమ ప్రాంతాన్ని సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి ఇక్కడ బాగా పండుతుందని నిపుణుల కమిటీ తెల్చింది. దీనికి తోడు కనుచూపుమేర ఎటు చూసినా విశాలమైన, ఎత్తైన కొండలు కలిగి ఉండడంతో ఈ ప్రాంతంలో గాలి నుంచి గాలిమరల ద్వారా పవన విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది.రాయలసీమ ప్రాంతంలో ఆలూరు, రాయదుర్గాన్ని సోలార్ హబ్ గా పత్తికొండ,ఉరవకొండ ప్రాంతాన్ని పవన విద్యుత్ ఉత్పత్తికి పుట్టినిల్లుగా ఎంచుకుంది. ఇక ఇక్కడ తయారైన విద్యుత్తును సబ్ స్టేషన్‌లో నిలువ ఉంచుతారు. ఆ తర్వాత ట్రాన్స్మిషన్ లైన్లు విద్యుత్ కారిడార్ల ద్వారా అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తారు. దీంతో ఈ ప్రాంతంలో ఉత్పత్తి అయిన విద్యుత్తును కడప జిల్లా సికే దినం నుంచి రాయదుర్గం మీదుగా సరిహద్దు కర్ణాటకలోని చిత్రదుర్గ,దావనగిరి, విజయనగర జిల్లాల మీదుగా తీసుకెళ్తారు.ఈ పవర్ ప్రాజెక్టు వల్ల ఒక్క రైతుకు అన్యాయం జరగదు. భూ ములు బలవంతంగా లాక్కోవడం ఉండదు. భూములను కౌలుకు తీసుకో వడమో లేదా రైతుల భూములకు న్యాయమైన పరిహారం ఇవ్వడమో జరుగు తుంది. జిల్లా కలెక్టర్ నేరుగా ఆయా ప్రాంతాల్లో పరిశీలించి అక్కడి పరిస్థితు లను, మార్కెట్ ధరలను, పంటల విలువలను, ఉద్యాన పంటలకు వేరువేరు గా రైతులకు నష్టం జరగకుండా నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.

# అంబేద్కర్ జయంతిని అడ్డుకోవలనుకోవడం సిగ్గుచేటు

## - న్యాయవాది చంద్ర శేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి సాకే హరి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని అడ్డుకోవలని ప్రయత్నించడం సిగ్గుచేటని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. గురువారం నగరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు. అనంతరం సప్తగిరి సర్కిల్‌లో మానవ హారం ఏర్పాటు చేసి న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డికి వ్యతిరేకంగా దళితులపై వివక్షత చూపుతూ పోలీసులుపైనే దౌర్జన్యంగా దాడికి చేసిన చంద్రశేఖర్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి అడ్డుకోవాలని ప్రయత్నించిన చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని అలాగే బార్ కౌన్సిల్ సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మీదుగా కోర్ట్ రోడ్డు బయలుదేరి జిల్లా కోర్టు ప్రాంగణం ప్రధాన రహదారి మీద ధర్నా చేసి ఆందోళన నిర్వహించారు. ధర్నా ఉద్దేశించి సాకే హరి మాట్లాడుతూ.. శ్రీ సత్య సాయి జిల్లా కనగానపల్లి మండలం కొండపల్లి గ్రామ దళితులకు రక్షణ లేకుండా పోయిందని గతంలోనూ రామాలయం ఆలయ ప్రవేశంలో చంద్రశేఖర్ రెడ్డి అడ్డుతగిలి దళితులను కులం పేరుతో దూషించి అవమానపరచడన్నారు. ఏప్రిల్ 14 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా దళితు లు ఊరేగింపు చేసుకుం టుండగా చంద్రశేఖర్ రెడ్డి అడ్డు పడాలని కుట్రప న్ని కొంత మందిని పోగేసుకుని రహదారిలో కాపు కాశాడన్నారు. పోలీసులు ముందుగా పసిగట్టడంతో ప్రమాదం తప్పిందన్నారు. పోలీసులు ఎంత చెప్పినా వినకుండా పోలీసుల పైనే తిరగబడి ఏకంగా సీఐ కాలర్ పట్టుకుని దాడి చేశాడన్నారు. పోలీసులే లేకుంటే దళితులపైన మరింత దారుణంగా దాడి చేసేవారని వాపోయారు. న్యాయవాది వృత్తిలో ఉండి అంబేద్కర్ జయంతిని అడ్డుకోవాలని దుర్మా ర్గమైందన్నారు. చంద్రశేఖర్ రెడ్డిని బార్ కౌన్సిల్ నుంచి రద్దు చేస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసేం తవరకు పోరాడుతామని బార్ కౌన్సిల్, జిల్లా ఎస్పీ ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి వేమన, ఎమ్మా ర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు, కుల వివక్షత వ్యతిరేక పోరాట కమిటీ వెంకటేష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సుగామంచి శ్రీనివాసులు, రాయలసీమ విద్యావంతులు వేదిక వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు, బండారు చంద్ర, సాకే నర్సిం హులు. కొం దపల్లి గ్రామస్తులు సాకే వన్నూరు స్వామి, ముత్యాలప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సాకే హరి తదితరులు

# ఇంటర్ లో మెరిసిన నాగ జాహ్నవి

## - సీనియర్ జర్నలిస్ట్ కాలవ రమణ కుమార్తె ప్రతిభ ...కాలవ కుమార్తెకు అభినందనలు వెల్లువ

అనంతపురం క్రైమ్ ,ఏప్రిల్ 16,ప్రభాతవార్త

కొన్ని దశాబ్దాలుగా జర్నలిస్టుగా పని చేసిన సీనియర్ జర్నలిస్టు, కీర్తిశేషులు కాలవ వెంకటరమణ కుమార్తె నాగ జాహ్నవి బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచింది. ఇటీవలే సీనియర్ జర్నలిస్టు కాలవ రమణ అనారోగ్యంతో పరమపదించిన విషయం తెలిసిందే. తండ్రి మరణించినప్పటికీ అయినా మొక్క వోని ధైర్యంతో కష్టాలను దిగమింగుకొని కష్టపడి చదువుకుంది. కేవలం ఆరు మార్కుల తేడాతో ప్రభంజనం సృష్టించింది. 470 గాను 464 మార్కులు సాధిం చింది. అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ నారాయణ కళాశాలలో చదు వుతున్న జాహ్నవి అత్యుత్తమ ప్రతిభ కనబరచడం పట్ల జిల్లా వ్యాప్తంగా పాత్రికే యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లా డుతూ.. చదువుల తల్లి జాహ్నవికి శుభాకాంక్షలు తెలియజేశారు. మీ నాన్న లేనిలోటు ఎవ్వరూ పూడ్చలేనిదని, కానీ మీ వెనుక మేమంతా ఉన్నా మ ని, నీకు ఎలాంటి ఇబ్బంది కలిగినా చేయందిం చడానికి మేము ఎల్లప్పుడు ముం దుంటామని, సహాయ సహకారాలు అందజేస్తామని అనంత పాత్రికే యులు భరోసా ఇచ్చారు. మిత్రుడు కాలవ రమణ నేడు భౌతి కంగా మనకు దూరమై నప్పటికీ ఆన ఆయన కన్న కలలు కుమార్తె నిజం చేసిందని ఆనందం వ్యక్తం చేశారు.



నాగ జాహ్నవి



తల్లితో జాహ్నవి

# ఘనంగా సత్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు

నార్పల ఏప్రిల్ 16, ప్రభాతవార్త

నార్పల మండల కేంద్రంలో వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి అభిమానులు బాణాసంచా కాల్చారు. అనంతరం కేక్ కట్ చేసి స్థానిక ప్రాథమిక వైద్యశాలలో వృద్ధులకు, గర్భిణులకు బ్రెడ్ ,మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నార్పల సత్య నారాయణ రెడ్డి మాట్లాడుతూ నా పుట్టినరోజుకి వేడుకలకు విచ్చేసిన ప్రతి ఒక్క వైఎస్ఆర్సిపి నాయకులకు, కార్యకర్తలకు, అభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కాగోళ్ళ ప్రభుదాస్‌కి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీపీ వైస్ చైర్ పర్సన్ వేదాంత నాగ రత్నమ్మ, వైసిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సాకే రామాంజనేయులు, ఉపాధ్య క్షులు సూరి, ఎంపీటీసీ కాటమయ్య, మండల ప్రధాన కార్యదర్శి చిగిచెర్ల రామయ్య, వేదాంత మోహన్, పవన్ కుమార్, బండ్లపల్లి ఆదినారాయణ, మనోహర, ముత్యాలు, కడపల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

# యస్వీ, డిగ్రీ, పీజీ కళాశాలలో పవర్ బిఐ శిక్షణ ముగింపు సభ ఘనంగా నిర్వహణ

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త

స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ బిఐ ఆఫ్‌లైన్ శిక్షణ తరగతుల యొక్క ముగింపు కార్యక్రమం కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ఏ.వి.ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చదిద్దడంలో కీలక పాత్ర పోషించేటువంటి ఇలాంటి మరెన్నో నైపుణ్యా భివృద్ధి, శిక్షణా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కచ్చితంగా నిర్వహి స్తామని, విద్యార్థులను ఆధునిక ఉద్యోగావకాశాలకు సిద్ధం చేస్తామని దీనికి కళాశాల యాజమాన్యం కట్టుబడి ఉన్నట్లు అయన తెలిపారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏ.శ్రీనాథ్ మాట్లాడుతూ..డిజిటల్ యుగంలో పవర్ బిఐ కోర్స్ యొక్క ప్రాముఖ్య తను వివరించి, విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానాన్ని వృత్తి జీవితంలో వినియోగించుకోవాలని ప్రోత్స హించారు. ఈ కార్యక్రమ ంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.సాయి రామ్, ట్రైనర్ జెన్నే సుమంత్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బిఐ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

# టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా వడ్డే సిమెంట్ పోలన్న

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

విజయవాడలోని తెలుగుదేశం పార్టీ సెంట్రల్ ఆఫీస్‌లో రాష్ట్ర కమిటీ కీలక నిర్ణయం తీసుకొని, పార్టీకి విశేష సేవలు అందించిన నాయకుడు వడ్డే సిమెంట్ పోలన్నను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనంతపురం నగరంలోని వడ్డెర సంఘం జిల్లా కార్యాలయంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచపు వడ్డే వెంకటేశులు ఆధ్వర్యంలో వడ్డే సిమెంట్ పోలన్నకు ఘన సన్మానం నిర్వహించారు. శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా కుంచపు వడ్డే వెంకటేశులు మాట్లాడుతూ..పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను గుర్తించి కీలక బాధ్యతలు అప్పగిం చడం అభినందనీయమని అన్నారు. వడ్డే సిమెంట్ పోలన్న రాష్ట్ర కార్యదర్శి గా నియమితులు కావడం వడ్డెర సంఘానికి గర్వకార ణమని అదేవిధంగా వడ్డెర కులానికి పెద్దపీట వేసి వడ్డే సిమెంట్ పోలన్న, బి.వి.వెంకటరాముడు, దేవళ్ళ మురళి, ఎలఐసి నరసిం హులు, వారికి రాష్ట్ర పదవులు ఇవ్వడం పై హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ మరింత బలోపేతం కావ డానికి అందరం కలిసి కృషి చే యాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో వడ్డెర సంఘం నాయకులు వెంక(రాముడు, సుధాకర్, రాజు, ఆదినారాయణ, బ్రహ్మయ్య, ఆది, సుబ్బ రాయుడు, నగేష్, వెంకట్రాముడు, మహబూబ్ బాషా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.




టిడిపి రాష్ట్ర కార్యదర్శి వడ్డే పోలన్నను సన్మానిస్తున్న దృశ్యం

# లాయర్ చంద్రశేఖర్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి

## - విహెచ్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న డిమాండ్

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కొండపల్లి గ్రామంలో 135వ అంబేద్కర్ జయంతి సందర్భంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత ఊరేగింపు జరుగుతుంటే అది జీర్ణించుకోలేని లాయర్ చంద్రశేఖర్ రెడ్డి ఆయనతోపాటు మరి కొంతమంది అంబేద్కర్ ఊరేగింపు జరుగుతున్న సమయంలో అడ్డుకోవడం జరిగిందనీ ఆ సమయంలో అక్కడే బందోబస్తు నిర్వహిస్తున్న సిఐ, ఎస్ఐలు తమ సిబ్బందితో ర్యాలీని అడ్డుకోబోతున్న లాయర్ చంద్రశేఖర్ రెడ్డి ఆయనతోపాటు ఉన్నవారిని నివారించడానికి వెళ్లడం జరిగిందని ఆ సమయంలో లాయర్ చంద్రశేఖర్ రెడ్డి అతనితో పాటు ఉన్నవారు పోలీసులపై తిరుగుబాటు చేసి హోంగార్డుపై దాడి చేయడం పోలీసులను దుర్భాషలాడడం జరిగిందని లాయర్ చంద్రశేఖర్ రెడ్డి అతనితో పాటు ఉన్న వారి పైన కేసులు కట్టి అరెస్టు చేస్తారనే భయంతో వీటన్నింటినీ కప్పిపుచ్చుకునేందుకు లాయర్ చంద్రశేఖర్ రెడ్డి పోలీసులే నా పైన దాడి చేశారని నా దగ్గర ఉన్న డబ్బు తీసుకోవడం జరిగిందని ఇలాంటి పక్కదారి పట్టించే మాటలతో తోటి లాయర్లకు కూడ కట్టకథలు చెప్పి వారితో ర్యాలీ చేయిం చడం జరిగిందని లాయర్ చం ద్రశేఖర్‌రెడ్డి అక్కడ విధులలో ఉన్న పోలీసులపైనే దాడి చేసి పోలీసులపైనే అబండాలు వేయడం తోటి లాయర్లకు నిజాలు దాచి లాయర్లను కూడ తప్పుదోవ పట్టించడం సరైంది కాదని తక్షణమే లాయర్ చంద్రశేఖర్ రెడ్డినీ అరెస్ట్ చేసి ఎస్సీ ఎస్టీ కేసుతోపాటు అత్యాయత్నం కేసులు పోలీసులపై దురుసుగ ప్రవర్తిం చడం పోలీసు లపై చేయి చేసుకోవడం తదితర కేసులను నమోదు చేసి కఠినంగ శిక్షించాలని వీహెచ్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.



విహెచ్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న

# ఘనంగా148 వ అక్కల్ కోటి మహారాజ్ ఆరాధన ఉత్సవాలు









మహారాజ్ ఆరాధన ఉత్సవాల దృశ్యాలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 16, (ప్రభాతవార్త)

వైభవంగా స్వామి సమర్థ అక్కల్ కోట్ మహారాజ్ 148వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక హెచ్ .ఎల్ .సి .కాలనీలోని అక్కలకోట మహారాజ ఆలయంలో బుధవారం ఉదయం నుంచే పంచామృత అభిషేకాలు. పసుపులేటి నీలిమ తో ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగాయి. అయ్యప్ప స్వామి ఆలయ ధర్మకర్త లింగమయ్య ప్రత్యేకంగా స్వామి యొక్క మహిమలు భక్తులకు తెలియజేశారు. వైభవోపేతంగా స్వామివారి రథోత్సవం నగర పురవీధుల గుండా జరిగింది.. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి హాజరై అక్కల్ కోట్ మహారాజ్ వారి దివ్య ఆశీస్సులు పొందినారు. ఈ కార్యక్రమంకలో దేవనూర్ సుందర విజయ్ కుమార్ , కేసి బాబు ,జయ చంద్రారెడ్డి ,నాగప్రసాద్, రామకృష్ణ ,నాగభూషణం, ఆనంద్, సత్యవతి, మాధవి, నాగరత్న, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం దేవాలయం ప్రధాన అర్చకులు పుబ్బరాజు విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంకల్ప్ హెల్త్ కేర్ వారిలో ఉచిత వైద్య శిబిరం డా,, రమ్యశ్రీ, డా,, సుహాసిని నిర్వహించారు.

# మెరుగుపడుతున్న బీసీ హాస్టల్ విద్యార్థిని ఆరోగ్యం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ఉన్న బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో వసతి పొందుతూ నర్సింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని బుధవారము ఆత్మహత్యయత్నానికి పాల్పడిన విషం అందరికి తెలిసిందే. ఆ విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. గత రెండు రోజులుగా వైద్య పరీక్షలు చేసి చికిత్సలు అందిస్తున్నారు. గురువారము గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. అందులో ఎలాంటి సమస్యలు లేవని రిపోర్టు పాజిటివ్ గా వచ్చింది.

అదేవిధంగా బ్రెయిన్ కు ఎంఆర్ స్కానింగ్ కూడా తీయడం జరిగింది. దీనికి సంబంధించిన రిపోర్టు శుక్రవారం ఉదయం వస్తుంది. రిపోర్టర్ పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోనున్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించి రిపోర్టును సెలవులో ఉన్న డిడి కుష్బూ కొఠారి ఆ విద్యార్థిని 95 శాతం బ్రతికే అవకాశం లేదని, కేవలం ఐదు శాతం మాత్రమే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కు రిపోర్టును పంపించడం జరిగింది. ఇన్చార్జి డిడి రామ సుబ్బారెడ్డి స్వయంగా ఆసుపత్రిలో విద్యార్థిని పరామర్శించి, డాక్టర్లతో తెలుసుకొని విద్యార్థిని కి ఎలాంటి ప్రాణాపాయం లేదని, ఆరోగ్యం కుదుటపడుతుందని రిపోర్టు ను జిల్లా కలెక్టర్ కు పంపించడం జరిగింది. ఇలా ఒక ఘటనపై రెండు రిపోర్టులను పంపడంపై ఆ శాఖలో తీవ్ర చర్చ జరుగుతుంది.

# 26న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి - ఆర్యవైశ్యులకు ఆహ్వాన పత్రికల పంపిణీ

పామిడి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతోత్సవాలను జయప్రదం చేయాలని ఆర్యవైశ్య యువజన కమిటీ సభ్యులు గురువారం రాత్రి ఆర్యవైశ్యులకు ఆహ్వాన పత్రిలకను పంపిణీ చేశారు. ఈనెల 26న ఆదివారం వేకువజామున అమ్మవారికి అభిషేకాలు ప్రత్యేక పూజలతో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతోత్సవాలు ప్రారంభమై మహిళలు 108 కళశాలు పూజా ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టిన అనంతరం మహామంగళహారతి గావించి తీర్థప్రసాదాలను అందజేస్తూ అన్నదానం చేయటం జరుగుతుందని తెలిపారు.

ఆధ్యాత్మిక యాజమాన్యం పర్యవేక్షణలో అమ్మవారి తపోత్సవం భక్తిగీతాల ఆలాపన, సాంస్కృతిక కార్యక్రమాలను ఉంటాయన్నారు. ఆర్యవైశ్యుల కుల దేవత అయిన శ్రీ వాసవి కన్యకా పరమే శ్వరి అమ్మవారు స్త్రీల ఆత్మగౌ రవం కోసం అహిం సా మార్గ ంలో 102 గోత్రాల వారితో కలిసి అగ్ని ప్రవేశం చేసిన పవిత్ర మాత అని ఆమెను పార్వతి దేవి అంశగా భావి స్తా రంటూ ఆర్యవైశ ్యల ందరూ జయం తో త్స వాలకు హాజరై అమ్మ వారి అను గ్రహం పొందాలని కోరారు.



ఆర్యవైశ్యులకు ఆహ్వాన పత్రిలను అందజేస్తున్న దృశ్యం.

# ఇంటర్ ఫలితాలలో భాష్యం పూర్వ విద్యార్థుల విజయకేతనం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

అనంతపురం నగరంలో హౌసింగ్ బోర్డ్‌లోగల భాష్యం విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు నిన్న విడుదలైన ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర ఇంటర్ ఫలితాలలో విజయకేతనం ఎగురవేశారు. మనస్వి 984/1000, దానియా ఫిర్దౌస్ 984/1000, దిలేహ 975/1000, సఫియా భాను 958/1000, లాస్యలతిక 958/1000, ద్వితీయ సంవత్సరంలో సాధించారు. సఫియా సుల్తానా 465/470, అమన్ షేక్ 449/470, శ్రీనిధి 439/455, వరుణ్ 435/455, చైత్ర 434/455 మార్కులు సాధించారు.

ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్లో తమ పిల్లలు ఈ మార్కులు సాధించడానికి భాష్యం స్కూల్లో పదవ తరగతి లోపు నేర్చుకున్న విద్య మరియు క్రమశిక్షణ దీనికి కారణమని భాష్యం స్కూల్‌కు ఎప్పటికీ తమ సహాయ సహకా రాలు అందిస్తామని కొనియాడా రు. పూర్వ విద్యార్థులను, విద్యార్థి తల్లిదండ్రులను అనం త పురం జిల్లా జెడ్ ఈవో, ప్రిన్సిపల్ బాలకృష్ణ మరియు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.



విజయకేతనం చూపుతున్న భాష్యం విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు

# పలు కార్యక్రమాలకు ఎపిబిఓసిడబ్ల్యూ బోర్డు ఆదేశాలు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ సంక్షేమ బోర్డు (ఎపిబిసిడబ్ల్యూ బోర్డ్) ద్వారా మ్యారేజ్ గిఫ్ట్ స్కీం, మేటెమిటీ బెనిఫిట్ స్కీం, నేచురల్ డెత్ రిలీఫ్ స్కీం, ఫ్యూనెరల్ ఎక్స్‌పెన్సెస్ స్కీం అమలు చేయుటకు ఫిబ్రవరి 5వ తేది ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 27వ తేదీన జరిపిన సమావేశంలో ముఖ్యమంత్రి ఆమోదం తెలిపిన నాలుగు స్కీంలను మార్చి 1 నుంచి అమలు చేయనున్నట్లు జిల్లా ఉప కమిషనర్‌కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువరించారు. ఇందుకు సంబంధించి లబ్దిదారుల నుంచి అప్లికేషన్స్ స్వీకరించుటకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అనంతపురం పట్టణంలో సహాయ కార్మిక అధికారి సర్కిల్-1 (9492555190), సర్కిల్-2 (9492555191), బైరవనగర్, జెఎన్‌టియు రోడ్ కార్యాలయములో సమర్పించాలని సూచించారు. సహాయ కార్మిక అధికారి, గుత్తి (9492555194), సహాయ కార్మిక అధికారి, గుం తకల్లు (9492555193), సహాయ కార్మిక అధికారి, తాడిపత్రి (9492555192), సహాయ కార్మిక అధికారి, రాయదుర్గం (9492555198) కార్యాలయములో దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ముఖ్యంగా, లబ్దిదారులు తమ యొక్క దరఖాస్తులను సమర్పించే సమయం లోనే నిబంధనల మేరకు అన్ని ధ్రువపత్రాలను సమర్పించాలన్నారు. కావున ఈ సదావకాశమును వినియోగించుకొని అర్హులైన లబ్దిదారులు దరఖాస్తులను సంబంధిత సహాయ కార్మిక అధికారుల కార్యాలములో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

# డాల్ అనురాధకు ఘన సన్మానం

శింగనమల ఏప్రిల్ 16 ప్రభాతవార్త

కురుకుంట అంబేద్కర్ గురుకుల కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శింగనమలమండలం సోధనపల్లి గ్రామానికి చెందిన డాల్ రమేష్ శివలక్ష్మి ల కుమార్తె డాల్ అనురాధ స్టేట్ ర్యాంక్ సాధించడంతో నేడు కురుకుంట కళాశాలలో ఉపాధ్యాయులు డాల్ అనురాధకు ఘనంగా సన్మానంచేసి విద్యార్థిని తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని అనురాధను ఆదర్శంగా తీసు కొని కష్టపడి చదివి మంచి ప్రతిభను కనపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యా ర్థులు కళాశాల సిబ్బంది తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



డాల్ అనురాధను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

# ఇంటర్ బైపీసీ ఫలితాల్లో ప్రతిభ చాటిన నిత్యశ్రీ - 1000 కి 978 మార్కులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 16,( ప్రభాతవార్త)

విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాప్తాడు మండల కేంద్రానికి చెందిన జర్నలిస్ట్ శ్రీనివాసులు, దివంగత ఉమాదేవి దంపతుల కూతురు నిత్యశ్రీ అద్భుత ప్రతిభ కనపరిచింది. ఇంటర్ బైపీసీ విభాగంలో ఈమె 1000 మార్కులకు గాను 978 మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. బాల్యం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించిన నిత్యశ్రీ, ఇంటర్మీడియట్ చిలమత్తూరు మండలం టేకులోడులోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభ్యసించింది. ఏడాది క్రితం తల్లి ఉమాదేవి అనారోగ్యంతో మరణించినప్పటికీ, ఆ బాధను దిగమింగుకుని తన తల్లి కలను సాకారం చేయాలనే దృఢ సంకల్పంతో ఏమాత్రం కుంగిపోకుండా చదివి ఈ విజయాన్ని సొంతం చేసుకుంది. తండ్రి,ఇతర కుటుంబ సభ్యులు , కళాశాల ఉపాధ్యాయుల నిరంతర ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించానని నిత్యశ్రీ పేర్కొంది. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి సమాజానికి సేవ చేయడమే తన లక్ష్యమని ఆమె తెలిపింది. ఒక సాధారణ జర్నలిస్టు కుటుంబం నుంచి వచ్చి, ప్రభుత్వ కళాశాలలో చదువుతూ అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల స్థానిక ప్రజలు, బంధువులు మరియు జర్నలిస్టు మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ నిత్యశ్రీని అభినందించారు.



కుటుంబ సభ్యుల తో నిత్యశ్రీ

# బాలయ్యను కలిసిన ముంటిమడుగు కేశవరెడ్డి

శింగనమల ఏప్రిల్ 16 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు తనయుడు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలుగుదేశంపార్టీ నందుఅత్యంత కీలకమైన పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నికైనందున గురువారం అమరావతిలోఆయనను మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుతోకలిసి అనంతపురం జిల్లా ఏడిసిసి బ్యాంకు చైర్మెన్ ముంటిమడుగు కేశవరెడ్డి. మర్యాద పూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కడప డిసిసిబి చైర్మన్.ఎం సూర్య నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.



నందమూరి బాలకృష్ణతో ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి

04ATP16_04ATP16.qxd 16-04-2026 PM 11:36 Page 1



## నేర నియంత్రణకు డ్రోన్లు సీసీటీవీ కెమెరాల వాడకం ఎంతో అవసరం - జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

### - 7 లక్షల విలువచేసే సీసీ టీవీ కెమెరాలు సోలార్ ప్యానల్ సిమ్ కార్డులు అందజేసిన దాతకు ధన్యవాదాలు తెలియజేసిన ఎస్పి




7 లక్షల విలువచేసే సీసీ టీవీ కెమెరాలు సోలార్ ప్యానల్ సిమ్ కార్డులు అందజేసిన దాతను సన్మానిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

నేర నియంత్రణకు, డ్రోన్లు సీసీటీవీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. గురువారం రామగిరి సర్కిల్ పోలీస్ కార్యాలయం పరిధిలోని చెన్నై కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు సిఎస్ఆర్ ఫండింగ్ కింద 7 లక్షల విలువచేసే సీసీటీవీ కెమెరాలు, సిమ్ కార్డులు సోలార్ ప్యానల్ ను సికేపల్లి కి చెందిన రామ్మూర్తి సహకారం తో వారి తల్లి ముత్యాలమ్మ చేతుల మీదుగా గురువారం సికె పల్లి పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌కి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ..నేరాలను అదుపు చేయడంలో ఇటీవల నైట్ విజన్ డ్రోన్లతో పాటు పాటు డే విజన్ డ్రోన్లు, సీసీటీవీ కెమెరాల వినియోగంపై ఎక్కువ దృష్టి సారించా మన్నారు. సిఎస్ఆర్ పండింగ్ కింద నైట్ విజన్ డ్రోన్లు మూడు, డివిజన్ డ్రోన్లు7 మొత్తం 10డ్రోన్లను తీసుకున్నామన్నారు.

ఇందులో భాగంగా సిఎస్ ఆర్ ఫండింగ్ కింద తీసుకున్న సీసీటీవీ కెమెరాలు, సోలార్ ప్యానల్, సిమ్ కార్డులను పోలీసులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. జిల్లా వ్యా ప్తంగా 400 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. నేరాలను అరికట్టడంతో పాటు అలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఇందు లో అదృ శ్యాలు రికార్డ్ అవుతాయని వెంటనే నేరస్తులు కనిపెట్టినందుకు వీలవుతుం దన్నారు. ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు దుకాణదా రులు, వ్యా పారులు ప్రతి ఒక్కరూ వారి ఇళ్ల వద్ద దుకాణాల వద్ద రోడ్డును ఫోకస్ చేసేలా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాలను అదుపు చేయ డంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకమైన నేపథ్యంలో ప్రతి ఒక్క రూ వీటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అడ్వాన్స్డ్ సీసీ కెమెరాలు విని యోగం ద్వారా సౌండ్ ఫీచర్ కూడా అందుబాటులో ఉందని తెలియజ ేశారు. సోషల్ రెస్పాన్సిబులిటీగా ఈ పరికరాలను అంద జేసిన దాత రామ్మూర్తికి ఎస్పీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా దాత రామ్మూర్తి తల్లి ముత్యా లమ్మను జిల్లా ఎస్పీ శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ పరికరాలను సమకూర్చ డంలో శ్రద్ధ వహించిన సీఐ, శ్రీధర్, సికె పల్లి ఎస్ఐ సత్య నారాయణలను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు, సి ఐ శ్రీధర్, ఎస్సైలు సత్యనారాయణ, రిజ్వాన్, ప్రదీప్ దాతలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు పంచాయతీల వారిగా ఓటర్ల జాబితా సిద్ధం

### - మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 68,274 మంది ఓటర్లు - పురుష ఓటర్లు 33,031 మంది, మహిళ ఓటర్లు 35,243 మంది - గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఓటర్ల జాబితాలు
### - మే నెలలో గ్రామ పంచాయతీల వారీగా ఖరారుకానున్న రిజర్వేషన్లు




ఉరవకొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయం (ఫైల్‌ఫోటో)

ఉరవకొండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం వేగంగా అడుగులు వేస్తోంది. తాజాగా గ్రామ పంచాయతీల్లో పోలింగ్ బూత్‌ల వారిగా ఓటర్ల జాబితాలను ఖరారు చేసి ప్రకటించింది. ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీల కార్యాలయాల్లో పోలింగ్ స్టేషన్ల వారిగా అందుబాటులో ఉంచింది. ఉరవకొండ మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఈవోఆర్డీ ఎం.సతీష్‌బాబు బృందం ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. మండలంలో 80 పోలింగ్ స్టేషన్లు ఉండగా వాటి పరిధిలో 68,274 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 33,031 మంది, మహిళా ఓటర్లు 35,243 మంది ఉండగా ఉండగా పురుషుల కంటే 2,212 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండటం విశేషంగా చెప్పాలి. గ్రామ పంచాయతీల వారిగా ఓటర్ల వివరాలిలా ఉన్నాయి. ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీలో 30,901 మంది ఓటర్లు ఉండగా పురుషులు 14,658 మంది, మహిళలు 16,243 మంది ఉన్నారు. పెద్ద కౌకుంట్ల పంచాయతీలో 6,101 మంది ఓటర్లు ఉండగా పురుషులు 3,072 మంది, మహిళలు 3,029 మంది ఉన్నారు. ఆమిద్యాల పంచాయతీలో 5,333 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,589 మంది, మహిళలు 2,744 మంది ఉన్నారు.

రాకెట్ల పంచాయతీలో 3,550 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,738 మంది, మహిళలు 1,812 మంది ఉన్నారు. షేక్షానుపల్లి పంచాయతీలో 3,439 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,706 మంది, మహిళలు 1,733 మంది ఉన్నారు. నింబగల్లు పంచాయ తీలో 2,481 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,224 మంది, మహిళలు 1,257 మంది ఉన్నారు. మోపిడి పంచాయతీలో 2,025 మంది ఓటర్లు ఉండగా పురుషులు 983 మంది, మహిళలు 1,042 మంది ఉన్నారు. నెరిమెట్ల పంచాయతీలో 1,845 మంది ఓటర్లు ఉండగా పురుషులు 915 మంది, మహి ళలు 930 మంది ఉన్నారు. చిన్నముష్టూరు పం చాయతీలో 1,664 మంది ఓటర్లు ఉండగా పురుషులు 789 మంది, మహిళలు 875 మంది ఉన్నా రు. వెలిగొండ పంచాయతీలో 1,626 మంది ఓటర్లు ఉండగా పురుషులు 823 మంది, మహిళలు 803 మంది ఉన్నారు. బూదగవి పంచాయతీలో 1,591 మంది ఓటర్లు ఉండగా పురుషులు 799 మంది, మహిళలు 792 మంది ఉన్నారు. రేణుమాకులపల్లి పంచాయతీలో 1,502 మంది ఓటర్లు ఉండగా పురుష లు 731 మంది, మహిళలు 771 మంది ఉన్నారు. లత్తవరం పంచాయతీలో 1,478 మంది ఓటర్లు ఉండగా పురుషులు 719 మంది, మహిళలు 759 మంది ఉన్నారు. వ్యాసాపురం పంచాయతీలో 1,252 మంది ఓటర్లు ఉండగా పురుషులు 630 మంది, మహిళలు 622 మంది ఉన్నారు. పెద్దముష్టూరు పంచాయతీలో 1,221 మంది ఓటర్లు ఉండగా పురుషులు 575 మంది, మహిళలు 646 మంది ఉన్నారు. రాయంపల్లి పంచాయతీలో 1,061 మంది ఓటర్లు ఉండగా పురుషులు 504 మంది, మహిళలు 557 మంది ఉన్నారు. ఇం ద్రావతి పంచాయతీలో 713 మంది ఓటర్లు ఉండగా పురుషులు 335 మంది, మహిళలు 378 మంది ఉన్నారు. లత్తవరం తండాలో 491 మంది ఓటర్లు ఉండగా పురుషులు 241 మంది, మహిళలు 250 మంది ఉన్నారు.

## విజయవంతంగా స్వీయ జనగణన నమోదు చేసుకున్న జిల్లా కలెక్టర్



స్వీయ జన గణన నమోదు చేయించుకుంటున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

శ్రీ సత్యసాయి జిల్లా ,ఏప్రిల్ 16, ప్రభాతవార్త ప్రతినిధి

2026 జనగణన నమోదులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ లో జనగణన పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో స్వీయ గణనను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో, ప్రభుత్వ పథకాల రూపకల్పనలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

కావున ప్రజలందరూ బాధ్యతగా ఈ ప్రక్రియలో పాల్గొని, ఖచ్చితమైన వివరాలను అందించాలని ఆయన కోరారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని స్వీయ గణన చేసుకోవడం ద్వారా సమయం ఆదా అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## రికార్డు సృష్టించిన నీలకంఠాపురంలోని ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్

### - తక్కువ కాలంలోనే 500 క్యాటరాక్ట్ ఆపరేషన్లు పూర్తి
### - హర్షం వ్యక్తం చేసిన మాజీ మంత్రి రఘువీరారెడ్డి




ఆపరేషన్ అనంతరం పేషంట్లతో డాక్టర్లు

అనంతపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త బ్యూరో

సీనియర్ నేత, సిడబ్ల్యుసి సభ్యుడు, మాజీమంత్రి రఘువీరారెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. తాను పుట్టిన ఊరుకు, ఊరు ప్రజలకు, చుట్టుపక్కల ప్రాంతాలకు తన కుటుంబీకులు, బంధువులతో కలిసి ఏదో ఒకటి చేయాలని మాజీ మంత్రి రఘువీరారెడ్డి నీలకంఠాపురంలో ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. శ్రీ సత్యసాయి జిల్లా మడక శిర మండలం నీలకంఠాపురం గ్రామంలో నీలకంఠాపురంశాంతా జయరాం వైద్య విజ్ఞాన సంస్థ, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టి ట్యూట్ అరుదైన మైలురాయిని అధిగమించింది. గత ఏడాది నవంబర్ 03 2025న ప్రారంభమైన ఈ ఆసుపత్రి, అతి తక్కువ కాలంలోనే 500 పైగా క్యాటరాక్ట్ (కంటి పొరలు) శస్త్రచికిత్సలను అత్యంత విజయవంతంగా పూర్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించింది.మడకశిర నియోజకవర్గంతో పాటు సరిహ ద్దున ఉన్న కర్ణాటక ప్రాంత నిరుపేదలకు ఈ ఆసుపత్రి ఒక వరప్రదాయినిగా మారింది. గతంలో మెరుగైన కంటి వైద్యం కోసం బెంగళూరు/హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. కానీ, “మన ఆరోగ్యం మన నీలకంఠాపురం” అనే లక్ష్యంతో అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులతో ఇక్కడే చికిత్సలు అందుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రఘువరన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ విజయవం తమైన ప్రస్థానాన్ని పురస్కరి ంచుకుని ఆసుపత్రి యాజమా న్యాన్ని, వైద్య బృందాన్ని ప్రత్యే కంగా అభినందించారు. నిరుపేదల సేవలో అహర్నిశలు శ్రమిస్తున్న వైద్యులు, సిబ్బంది అంకితభావం వల్లే ఈ రికార్డు సాధ్యమైందని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో ఈ సంస్థ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు అందిస్తామని ఆయన ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్రీ సత్యసాయి జిల్లాలో ఓటర్లు 11,35,917 - పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం

శ్రీ సత్యసాయి జిల్లా, ఏప్రిల్ 16, ప్రభాతవార్త ప్రతినిధి

శ్రీ సత్యసాయి జిల్లాలోని 32 మండలాల్లో గల 467 గ్రామ పంచాయతీలకు సంబంధించి వార్డుల వారీగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను జిల్లా గ్రామ పంచాయతీ అధికారి (డిపిఓ) ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం1994 నిబంధనల మేరకు ఏప్రిల్ 15, 2026 నాటికి ఈ వివరాలను ఖరారు చేసినట్లు తెలిపారు.

జిల్లాలో మొత్తం 32 మండలాలు ఉండగా 467 గ్రామ పంచాయతీ కలవు. ఈ పంచాయతీలలో మొత్తం వార్డులు 4,912 కాగా, పురుష ఓటర్లు 5,66,785, మహిళా ఓటర్లు 5,69,103 మంది, ఇతరులు 29 మొత్తం ఓటర్ల సంఖ్య 11,35,917 మంది ఉన్నట్లు అధికారులు తెలియజేశారు. జిల్లాలో పురుషుల కంటే సుమారు 2,318 మంది మహిళా ఓటర్లే అధికంగా ఉండటం విశేషం. ఈ జాబితాను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

## మహిళా కోటాలో బీసీలకు ఉపకోట కేటాయించాలని ఢిల్లీలో ధర్నా

### - మద్దతు పలికిన ఎంపీ అంబికా లక్ష్మినారాయణ





మాట్లాడుతున్న ఎంపి అంబికా లక్ష్మినారాయణ

అనంతపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త బ్యూరో

న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 33 శాతం మహిళల రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ఉపకోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం నిర్వహించిన ధర్నాలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా టీడీపీ పార్టీ తరఫున రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావుతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని మా మద్దతు తెలియ జేశాను అని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర పార్టీలకు చెందిన ఎంపీలు కూడా పాల్గొని బీసీ మహిళలకు న్యాయం చేయాలనే డిమాండ్‌ను బలంగా వ్యక్తం చేసినట్లు ఎంపీ తెలిపారు.

## రెడ్ బుక్ రాజ్యాంగంతో వైసిపి నేతలపై అక్రమ కేసులు

### - మాజీ మేయర్ మహ్మద్ వసీం విమర్శ




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్ మహ్మద్ వసీం

అనంతపురం సిటీ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరిట వైసిపి నేతలపై అక్రమ కేసులు బనాయించి వేదిస్తున్నారని మాజీ మేయర్ మహ్మద్‌వసీం విమర్శించారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరిని కుప్పం పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని విమర్శించారు. కేవలం ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ఎత్తిచూపుతుండటంతో ఓర్వలేక అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆయన మండి పడ్డారు. అదే టిడిపి నేతలు చేస్తున్న దౌర్జన్యాలు, దాడులపై ఫిర్యాదులు చేసినా పోలీసులు కనీసం స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు కేవలం కూటమి నేతలకు అనుకూలంగా మాత్రమే పని చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. ముఖ్యమంత్రివగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అయితే సూపర్‌సిక్స్ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు హామీలను అమలు చేయకుండా హామీ లపై ప్రశ్నిస్తూ గళం విప్పిన వారిపై కేసులు నమోదు చేస్తూ గొంతు నొక్కే ప్రయ త్నం చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. కూటమి నేతలు చేస్తున్న అరాచకాలు అక్రమ కేసులను ప్రజలంతా గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలుసిద్దంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ కమల్‌భూషణ్, వైసిపి నేత కుళ్లాయి స్వామిలు పాల్గొన్నారు.

## విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచే దిశగా దృష్టి సారించాలి

### - జెఎన్‌టియుఏ విసి సుదర్శనరావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెఎన్‌టియు ఏ విసి సుదర్శన్ రావు

అనంతపురం సిటీ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

విద్యార్థుల్లో నూతన టెక్నాలజీని చేరువ చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించేందుకు జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు సూచించారు. జెఎన్‌టియుఏ ఆర్యభట్ట ఆడిటోరియంలో గురువారం అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల సదస్సు లు నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు, సమాజంలో యూనివర్సిటీకి అనుబంధంగా క్వాంటం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై ఇటీవల రాష్ట్రస్థాయి సదస్సులో నిర్దేశించిన లక్ష్యాలను కళాశాలలో ప్రిన్సిపాల్‌లకు వివరించారు. నూతనంగా ఇంజినీరింగ్ విభాగంలో సిలబస్-26 రూపొందించిన మార్గ నిర్దేశాలను యూనివర్సిటీ అవలంభిస్తున్న విధానాలను ప్రతి కళాశాలలో తప్పనిసరిగా అమలుపర్చాలని ఆయన సూచించారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించడంలో రాజీ పడబోమని ఆయన స్పష్టం చేశారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని కళాశాలల ప్రిన్సి పాల్ స్‌తోపాటు మేనేజ్‌మెంట్ కృషి చేయాలని సూచిం చారు. ప్రతి విద్యార్థి ఉద్యోగం పొందేలా శిక్షణ ఇవ్వడానికి ప్రతి ఒక్కరు కృషి చేయా లని సూచిం చారు. కార్యక్రమంలో డిఏపి సత్య నారాయణ, కోఆర్డినేటర్ లలితతోపాటు పలు కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొ న్నారు.

## కరెంటోళ్ల కాసుల బాట..!




చెప్పేందుకే నీతులు..కనిపంచవు మెరుగైన సేవలు

( మొదటి పేజీ తరువాయి ) ఓ నియంత్రికను తొలగించి, త్వరలో ప్రారంభం కానున్న ఓ పెట్రోల్ బంకుకు ఉపయోగ పడే విధంగా ఆ నియంత్రికను, మరో నియంత్రికకు జతచేసి ఏర్పాటు చేయడంలోనూ ఓ అధికారి చేతివాటం ప్రదర్శించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

ః తాడిపత్రి డివిజన్ పరిధిలోని ఓ మండల ఏఈ జాతీయ రహదారి పక్కన ఓ వ్యక్తికి ఎల్‌టీ2ఏ1 కేటగిరీ కింద ఫిబ్రవరి 7న విద్యుత్తు సర్వీసు ఇవ్వడానికి స్వయంగా రిజిస్ట్రేషన్ చేశాడు. ఇందులో మతలబు ఏమంటే సదరు వ్యక్తితో రూ. 1.50 లక్షకు ఒప్పందం చేసుకొని, మొదటి విడతగా రూ. 1.30 వేలు తీసుకున్నట్లు తెలుస్తోంది. స్థలం ఒక గ్రామ పరిధిలో ఉంటే సర్వీసు రిజిస్ట్రేషన్ మరో గ్రామ పరిధిలో చేసినట్లు తెలుస్తోంది. అంచనాకు మించి వసూలు చేసినట్లు సిబ్బందిలో చర్చ నడుస్తోంది.

ఃఇదే అధికారి తాను గతంలో పనిచేసిన చోటకు వచ్చిన మరో అధికారి విద్యుత్తు లైను పనులు చేస్తున్న సందర్భంలో ఎల్‌సీ ఇచ్చే స్థానంలో ఉన్న మొదటి అధికారి ఎల్‌సీ ఇవ్వడానికి తన సమానస్థాయి అధికారి కదా అని కూడా చూడకుండా రూ. 20 వేలు ముక్కుపిండి వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

ః మరో మండలంలో 18 సర్వీసులకు సంబంధించి రైతులందరూ మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులందరికీ రూ.1.70 లక్షలు అందజేశారు. ఒకరు ట్రస్టు పేరున జమ చేయించుకుంటే, కొద్ది రోజులు ఇన్‌ఛార్జిగా ఉన్న మరో అధికారి తానెక్కడ రెగ్యులర్ బాధ్యతలు నిర్వహిస్తుంటే అక్కడికే రైతులను రప్పించుకొని తన మామూలు తీసుకోవడం, మరో అధికారి తన కార్యాలయపు గదిలోనే చేతివాటం ప్రదర్శించడం, పై అధికారులందరికీ ఇచ్చారు కదా నాకిచ్చేది ఇవ్వండని మరో ఏఈ డిమాండు చేయడం అప్పట్లో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఇలా చెప్పుకుంటూ పోతే విద్యుత్తు శాఖలో అవినీతి, దుష్ప్రవర్తన, లెక్కలేని తనం చాలా మంది ఉద్యోగులు, సిబ్బందిలో కనిపిస్తోంది. డయల్ యువర్ సీఎండీకి ఫిర్యాదు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదనేది పలువురి వినియోగదారుల ఆరోపణ. ఇక్కడ కొందరు కింది స్థాయి సిబ్బంది తమ పై అధికారికి, ఆ పై అధికారి మరో పై అధికారికి, ఈ పై అధికారి ఇంకో పై అధికారికి అంటూ ఒక గొలుసును తలపించేలా మామూళ్ల నడుస్తున్నాయనేది బహిరంగ రహస్యమే. ఇప్పటికైనా సీఎండీ ఇక్కడి అవినీతిపై దృష్టి సారించి పారదర్శకంగా లోతైన విచారణ చేస్తే అవినీతి అధికారుల ఆట కట్టించవచ్చనే వాదనలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

## మహిళా రిజర్వేషన్లతో మారనున్న రాజకీయ సమీకరణలు

( మొదటి పేజీ తరువాయి ) ఆర్థికంగా బలంగా ఉన్న వారికి కొన్ని స్థానాలను అనంతపురం జిల్లాలో కేటాయించిన విషయం తెలిసిందే.. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గాల పునర్విభజన వల్ల తమకు సీట్లు వస్తాయని ద్వితీయ శ్రేణి నాయకుల ఆశించడం కూడా తప్పే అవుతుంది. ఇప్పుడు ఆయన నియోజకవర్గాల్లో ఉన్న పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తమకు సీట్లు ఇవ్వకపోతే తమ కుటుంబ సభ్యులకు ఇవ్వాలని ఆయా పార్టీల అధినేతల వద్ద ప్రతిపాదనపెట్టే అవకాశం ఉంది.

మహిళా రిజర్వేషన్ల వల్ల తమ స్థానం కోల్పోవాల్సి వస్తే తమ సతీమణికి, తమ కూతుర్లకు, తమ కోడళ్ళకు ఎవరికో ఒకరికి టికెట్లు ఇవ్వాలని మగధీరులు పట్టుపట్టే అవకాశం లేకపోలేదు.

ఇదే సమయంలో మహిళా రిజర్వేషన్లు అమలు అయితే తాము టికెట్ కోసం గట్టిగా ప్రయత్నించవచ్చని అనంతపురం, గుంతకల్లు, తాడపత్రి, కళ్యాణ్ దుర్గం, రాప్తాడు, పెనుగొండ, పుట్టపర్తి, కదిరి, హిందూ పురం తదితర నియోజకవర్గాల్లో టిడిపి, వైసీపీ పలువురు మహిళా నాయ కులు ఆశతో ఎదురు చూస్తున్నారు.. చూడాలి ఎవరి ఆశలు ఏ మేరకు ఫలిస్తాయో.